గద్య సంగ్రహం

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001

గద్య సంగ్రహం

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001

చతుర్థ ముద్రణ : 1998

ప్రతులకు :
ఆంధ్రసారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.

ప్రవేశ పరీక్ష పాఠ్యాంశం

వెల : 18.00

ముద్రణ :
మాధవి ప్రింటర్స్,
కుత్బిగుడా, హైదరాబాదు - 500 027.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణ రెడ్డి ఎం.పి.
ఎం.ఏ., పి.హెచ్.డి., డి.లిట్.,
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

పీఠిక

తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు అయిదు దశాబ్దాలకు పైగా ఈ రంగాలకు విశేష సేవలందిస్తోంది. బహుముఖీనంగా కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తోంది. తెలుగు భాషావ్యాప్తి నిమిత్తం పరిషత్తు ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ పాఠశాలలో విద్యాభ్యాసంచేసే అవకాశం లేనివారు తెలుగు చదువుకునేందుకు వీలు కల్గించి ప్రాథమిక, ప్రవేశ, విశారద (పూర్వోత్తర భాగాలు) పరీక్షలు జరుపుతోంది.

పరిషత్తు వయోజన విద్యావ్యాప్తి కోసం శిక్షణకేంద్రం నిర్వహించి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చింది. గ్రామసీమల్లో వయోజన పాఠశాలలు నడిపి అక్షరాస్యతా వ్యాప్తికి దోహదం చేసింది. కార్మికులకోసం వయోజన పాఠశాలలు నిర్వహించింది. వివిధ సాహిత్య ప్రక్రియల్లో చేపట్టే ప్రచురణలకు అదనంగా పరిషత్తు విద్యావ్యాప్తి నిమిత్తం ప్రత్యేకంగా గ్రంథాలను ప్రచురిస్తోంది.

'గద్యసంగ్రహం' అనే ఈ గ్రంథం పరిషత్తు నిర్వహించే 'ప్రవేశ' పరీక్షకు పాఠ్యగ్రంథంగా వుంది.

అంతేకాదు, ఇతర విద్యాసంస్థల అవసరాలకు తగినట్లు తెలుగు పాఠ్య గ్రంథాలను పరిషత్తు రూపొందించి వెలువరిస్తోంది.

డా॥. సి. నారాయణ రెడ్డి

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఎం.ఏ., పి.హెచ్.డి.
ప్రధాన కార్యదర్శి,
ఆంధ్ర సారస్వత పరిషత్తు,
హైదరాబాదు.

ప్రస్తావన

ఆంధ్ర సారస్వత పరిషత్తు యాభై ఏళ్ళుగా అనేక గ్రంథాలు ప్రచురించింది. అందులో సాహిత్యోపకారమైన రచనలు, ప్రసంగ వ్యాసాలు, పరిషత్తు పరీక్షలకు ఉపయుక్త గ్రంథాలు ఉన్నాయి. పరిషత్తు ప్రచురణలను తెలుగువారు విశేషంగా ఆదరించారు, ఆదరిస్తున్నారు. ప్రచురణల విభాగాన్ని పటిష్ఠం చేయాలని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారు సంకల్పించారు. త్వరలోనే మరికొన్ని గ్రంథాలు వెలువడనున్నాయి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపన దశ నుంచి ఈనాటిదాకా విద్యావ్యాప్తిని, సాహిత్యసేవను దృష్టిలో పెట్టుకొని ప్రచురణలు చేపడుతున్నది. వయోజనవిద్యకు, అనియత విద్యకు ఉపకరించే గ్రంథాలు కూడా గత ప్రచురణల్లో ఉన్నాయి. 'గద్యసంగ్రహం' అనే ఈ గ్రంథం పరిషత్తు నిర్వహించే 'ప్రవేశ' పరీక్షకు పాఠ్యగ్రంథంగా వుంది. గతంలో నిజాం రాష్ట్రాంధ్రుల నుంచి ప్రవాసాంధ్రుల దాకా సాహిత్యపరమైన అవసరాలు దృష్టిలో పెట్టుకొని పరిషత్తు గ్రంథాలు ప్రచురించింది. అయితే, ఈనాటి అవసరాలను గుర్తించి తగిన గ్రంథాలు రూపొందించే ప్రయత్నంకూడా పరిషత్తు చేస్తున్నది. ఇంతకు ముందులాగే 'గద్య సంగ్రహం' అనే ఈ గ్రంథాన్ని ఆంధ్ర పాఠకలోకం ఆదరిస్తుందని ఆశిస్తాను.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ఇందులో

హైస్కూలులో

వివాహకాలమున నేను హైస్కూలులో చదువుకొనుచుంటినని వ్రాసియుంటిని. మేము మూవురు సోదరులము. ఒక పాఠశాలయందే చదువుచుంటిమి. జ్యేష్ఠునిది చాల పయితరగతి. నాతోపాటు పెండ్లి అయిన రెండవ సోదరుడు నా పయితరగతిలో ఉండెను. మాకు ఒక యేడు వివాహముతో విద్యానాశమాయెను. ఈ నా అన్నపని మరీ అన్యాయము. ఆయన బడి మానెను. ఎందరు పిన్నవాండ్రు ఇట్టి అవస్థకు పాలుపడిరో దైవమునకే ఎరుక, నేటి మన హిందూ సంసారములందు మాత్రము విద్యా వివాహములు రెండును సమముగా నడచును.

నా చదువు ఎడతెగక సాగుచుండెను. హైస్కూలున నాకు మొద్దబ్బాయి అని గణన లేదు. నాయెడ ఉపాధ్యాయులకు వాత్సల్యము. కుఱ్ఱని నడివడిగూర్చియు, విద్యనుగూర్చియు తలిదండ్రులకు ప్రతి యేడును ఉల్లాకు (certificate) పంపుచుండుట మామూలు. నాకు ఎపుడును చెడ్డ సర్టిఫికేట్ లేదు. అది యటుండ, నేను రెండవ తరగతి గెలుపొందిన పిదప బహుమతులుకూడ సంపాదించితిని. నెల ౧కి అయిదవ తరగతిలో నాలుగును, ఆఱవ తరగతిలో పదియును రూపాయలు విద్యార్థి వేతనము వడసితిని. ఇది కేవలము నా ప్రజ్ఞవలన గాదు, మరి అదృష్టమువలన, ఏలన, ఈ వేతనములు అందరకు కావు, అవి కేవలము కాఠియావాడులోనా సోరఠు డివిజనునుండి వచ్చువారిలో శ్రేష్ఠులకుమాత్రము, మరియు నలువండ్రు,

ఏబంద్రు కల తరగతిలో నోరతునుండి వచ్చు కుఱ్ఱలును ఎక్కుడు మంది ఉండువారు కారు.

నా తెలివితేటల విషయమై నాకు తృప్తి ఉన్నటులు గురుతుచాలదు. బహుమతులు గాని, వేతనము గాని లభించినపుడు ఆశ్చర్యము కలిగెడిది. కాని ప్రవర్తనమును కడు మెలకువతో కాపాడుకొనుచుండువాడను. నలుసంత దోసగు కానిపించిన కన్నుల జొటజొట నీరు ఉరలెడిది. దండ్యుడ నయినపుడు కాని, వీడు 'దండ్యుడు' అని గురువు అనుకొనునపుడు కాని నా చింతకు మేరలేదు. నే నొకతూరి దెబ్బలు తిన్నట్లు ఉన్నది. కొట్టిరని నే నంతగా వగవలేదు. కాని కొట్టదగిన నేరము చేసితినని అనుకొనిపోవుదురుగదా అని మిగుల వగచితిని. వెక్కి వెక్కి ఏడిచితిని. ఈ ముచ్చట నేను ఒకటవ తరగతిలో ఉండగనో, నేను ఏడవ తరగతిలో ఉండగా ఇట్టిదే మరియొకటి. అపుడు హెడ్‌మాస్టర్ దొరాబ్జి ఎదుల్జీ గిమీ. అతడు శిష్యవత్సలుడు, నియమపాలకుడు, విధివర్తి, సుశిక్షకుడును. ఆయన పయితరగతులలోని బాలురకు శరీర వ్యాయామము, క్రికెట్ వ్యాయామము తప్పని సరిగా చేసెను. నాకు రెండును గిట్టనివి. ఈ నియమమునకు ముందు నేను క్రికెట్‌గాని, ఫుట్‌బాల్‌గాని మరియేదిగాని ఆడిన పాపమున పోలేదు. దానికి కారణము నేడు నాకు తప్పని తెలిసిన బిడియమే. శరీర వ్యాయామమునకు చదువుతో పొత్తులేదని నాడు నాకు దురుహ. విద్యాప్రణాళికలో మనశ్శిక్షకు ఎంతతావు కలదో శరీర వ్యాయామమునకు అంత తావు ఉండవలయునని నాకు నేడు తెలియును.

వ్యాయామమును వీడినందువల్ల నాకు లోటులేదని చెప్పగలను. ఏలన, బయలున చాల దవ్వు నడచుట మంచిదని అచట నచట చదివి ఆ సలహాను గమనించి నేను అలవాటులో ఉంచుకొనిన నడకను

అలవరిచికొంటిని. తిరుగుట కూడ నొకవిధమగు వ్యాయామమే కావున ఈ వ్యాయమముచే నాకు తగురీతి శరీర పాటవము కలిగెను.

మా తండ్రిగారికి పరిచర్య చేయువలయునను మిక్కుటమగు అభిలాషకూడ శరీర వ్యాయామమునెడ అనిష్టమునకు రెండవ కారణము, బడి వదలగనే ఇంటికి పరువిడి మా తండ్రి పరిచర్యలలో లగ్నమయ్యెడివాడను. వ్యాయామ నియమము దీనికి అడ్డు తగిలెను. మా తండ్రిగారికి నేను పరిచర్య చేయువలయును కాన నాకు ఈ నియమము లేకుండ చేయుడని గిమీగారికి విన్నవించుకొంటిని. ఆయన నా మాట వినలేదు. ఆ రోజులలో శనివారమునాడు ప్రొద్దుటిపూట బడి. ఆ శనివారపు సాయంకాలమున నాలుగు గంటలకు వ్యాయామమునకై ఇంటి నుండి బడికి పోవలసి వచ్చెను. నాకు గడియారము లేదు. ఆకసము మేఘావృతమై యుండెను. ఆ కారణమున నాకు ప్రొద్దు తెలియలేదు. మబ్బులు నన్ను మోసగించెను. నేను బడికి వెళ్ళువరకు అచట ఒక పిట్టయేని లేదు. మరునాడు గిమీగారు హాజరుపట్టి పరీక్షించుచు నన్నుజూచి నీ వేల నిన్న హాజరు కావైతివని అడిగిరి. నేను జరిగినది చెప్పితిని. ఆయన నా మాట నమ్మక అణాయో, రెండణాలో కాని (నా కిపుడు గురుతు లేదు) జరిమానా వేసెను.

నేను అబద్ధాలకోరననిపించుకొంటిని. ఇది నాకు ఎంతో వింత కలిగించెను. నేను జూటాకోరును కానని ఎటుల సమర్థించుకోగలను. ఉపాయాంతరము లేదు. మనము రోషపూరితమయ్యెను. మిగుల దుఃఖించితిని. సత్యమును నమ్ముకొన్నవాడు ఎల్లపుడును జాగ్రత్తగా ఉండవలెనని నేను గమనించితిని. నా విద్యావ్యాసంగ మధ్యమున బడిలో నేను అశ్రద్ధగా నుండుటకు ఇదియే ఆది। ఇదియే అంతమును, జరిమానా వేసిన సొమ్ము తిరిగి యిచ్చునటులు చేసికొనగలిగితినని నాకు కొంత గురుతు.

'బడి వదలగనే మా వాడు నాకడ ఉండవలసియున్నా' డని మా నాయనగారి కోరిక మీద తుదకు నాకు వ్యాయామమునుండి విడుదల కలిగినది. నేను వ్యాయామమును ఏమరుటచే కొరవడకున్నను మరియొక ఏమరికకు దండము లర్పించుకొనుచునే యున్నాను. 'దస్తూరి విద్యలో ఒక భాగము కాదు' అను ఈ దురుద్దేశము నాకు ఎటనుండి యొదవెనో తెలియదు కాని, ఇంగ్లాండు వెళ్ళు వరకు నిలువ ఉండెను. తరువాత తరువాత, ముఖ్యముగా దక్షిణాఫ్రికాలో అచట పుట్టి, అచట విద్యావంతులైన పిన్నవారలయు, లాయరులయు ముత్తియములబోలు చక్కని వ్రాతను చూచి సిగ్గిల్లిన నేను దానిని ఏమఱినందులకు పశ్చాత్తాపపడితిని. చెడు దస్తూరిని అసమగ్రమగు విద్యయొక్క చిహ్నముగా పరిగణింపవచ్చునని నే నరసితిని. పిదప నేను వ్రాయసమునకు పాటుపడితిని గాని తరుణము తప్పెను. నా బాల్యమునందలి లోపమును నేనెన్నటికిని దిద్దుకొనలేక పోతిని. నన్ను చూచి ప్రతి చిన్నవాడును ప్రతి చిన్నదియు జాగ్రత్తపడుగాక ! మంచి దస్తూరి విద్యలో ఒక ముఖ్యాంశమని గుర్తించుగాక ! అక్షరముల దిద్దుంచుటకుముందు బాలురకు చిత్రలేఖనము నేర్పుట యుక్తతరమని నాకు నేడు తోచుచున్నది. పూవులు, పిట్టలు మొదలగు వానిని పరికించి గీయునటులే అక్షరములనుగూడ పరికించి వ్రాయుట తగును. వస్తువులను చూచి వ్రాయుట నేర్చుకొన్న పిదపనే వ్రాత నేర్చుట తగును. అపుడు వరవడి అచ్చునుబోలి యుండును.

నాటి బడిమాటలు చెప్పదగినవి రెండు కలవు. వివాహముచే నాకు ఒక యేడు విద్యానాశము వాటిల్లినది. దానిని కూడదీయుటకు ఉపాధ్యాయుడు పయితరగతిలో ప్రేరేపించెను. కష్టించి వ్యాసంగము చేయు వారికి సాధారణముగా ఈ వీలు ఉండెడిది. కాన నేను మూడవ తరగతిలో

ఆజూనెలలే ఉండి వేసవి సెలవులకు ముందు జరుగు పరీక్షలు అగుపిదప నాలుగవ తరగతిలోనికి దాటింపబడితిని, నాల్గవ తరగతి మొదలుకొని చాల పాఠములు ఇంగ్లీషుననే బోధింపబడు చుండెను. నేను ఇంగ్లీషులో లేశమైనను తెలిసికొనలేకుంటిని. క్షేత్ర రేఖా గణితములు నాల్గవ తరగతి లోనే ప్రారంభమగుచుండెను. వానిసంగతి బాగుగా నాకు తెలియదు. ఆంగ్లములో బోధించుటచే అది మరికొంచెము రాయి ఆయెను. క్షేత్రగణితములో ఉపాధ్యాయుడు మంచిబోధకుడే కాని నాకు మాత్రము తెలిసి కొను శక్తి లేదు. పలుమారులు నిరాశచెంది రెండేండ్ల చదువు ఒకయేడు మింగదలచుట పేరాశయని మరల మూడవ తరగతిలో చేరదలచితిని. ఇటుల చేయుట నాకే కాక నా గురువులకును తలవంపులమారి పని ; ఏలన నావ్యాంసగమును విశ్వసించికదా ఆయన నన్ను పైనవేసెను - అను ఈ రెండు భయములును నన్ను ఆ తరగతియందే ఉంచెను. ప్రబలముగా వ్యాసంగము చేసి యూక్లిడ్‌లో ౧౩ వ ప్రాపొజిషన్ వరకు రాగా, అట నుండి క్షేత్రగణితము అన్నిటికంటే రుచికరమైనదిగా గోచరించెను. తనంతట తాను తెలివి తేటలను, సరళప్రయోగమును ఉపయోగించి చూడదగిన విషయమున కష్టముండదు. నాడు మొదలుకొని నాకు రేఖా గణితమునెడ సౌలభ్యమును, అభిరుచియు కలిగెను.

సంస్కృతము మరీ కష్ట మనిపించెను. రేఖాగణితమున వల్లన వేయదగిన దేదియు లేదు. ఇక సంస్కృతమునన్నో, ప్రతిదినము కంఠపాఠముగా ఉంచుకొనవలెనని నా ఊహ. ఈ పాఠము కూడ నాలుగవ తరగతి నుండి ఆరంభింపబడును. ఆరవతరగతిలోనికి వచ్చుసరికి బెదరి పోతిని. సంస్కృతోపాధ్యాయుడు పాఠము ఎక్కువ ఇచ్చి అంతయు ఒక్కమారు నూరిపోయు స్వభావము కలవాడు.

సంస్కృతోపాధ్యాయులకును, పారశీకోపాధ్యాయులకును ఏదోస్పర్ధ ఉండేది. ఫారసీ మౌల్వీ సౌమ్యుడు. ఫారసీ మిగుల తేలిక యనియు, మౌల్వీ విద్యార్థులయెడ దయాదాక్షిణ్యములు కలవాడనియు బాలురు తమలో తాము అనుకొను చుండెడివారు. ఈ తేలికతనము నన్ను బెల్లించెను. ఒకనాడు పోయి ఫారసీ తరగతిలో కూరుచుంటిని. అందులకు సంస్కృతోపాధ్యాయుడు దుఃఖించెను. అతడు నన్ను పిలిపించి 'ఓయీ, నీ వెవరి కుమారుడవు ? నీ మతభాషను నీవు నేర్చుకొనగోరవా ? నీకు తెలియనిచో నన్నడుగుము. నా శక్తికొలది విద్యార్థులకు సంస్కృతము బోధించు కోరిక నాకు కలదు. చదివినాకొలది తన్మయము చేయు విషయములు మీకు కానిపించును. అధైర్యము వలదు. మరల వచ్చి నా క్లాసులో కూరుచుండుము' అనెను. వారి దయచే నాకు సిగ్గు పుట్టెను. గురు ప్రేమను తిరస్కరింప జాలక పోయితిని. నేడు నా యాత్మ కృష్ణశంకర పాండ్యాగారి ఉపకారమును స్మరించుచున్నది. ఆనాడు ఆ కొలది సంస్కృతమునేని నేను చదివి యుండనిచో మన శాస్త్రములందు ఆనందింపశక్తుడ కాకపోవువాడనే. కాని 'సంస్కృతము ఎక్కువ చదువుకొనలేదే' అని నాకు విచారము కలదు. ఏలన, ప్రతి హిందూబాలుడును, బాలికయు సంస్కృతము చక్కగా చదువుకొని తీరవలయునని ఇటీవల ఎరిగికొంటిని.

భరతవర్షమున ఉన్నత విద్యాప్రణాళికలో మాతృభాషయు, ఉపరి హిందీ సంస్కృత ఫారసీ అరబ్బీ ఇంగ్లీషు భాషలు పాఠ్యములుగా చేయదగినవని నా ఆశయము. ఈ సంఖ్యకు భీతిల్ల పనిలేదు. మన విద్య యింతకంటె క్రమబద్ధమై ఉండి బాలురకు ఇంగ్లీషుభాషలోనే పాఠములు నేర్వవలసిన బరువు లేకుండినచో ఈ భాషలన్నియు నేర్చుకొనుట ఒక

శ్రమంగాక మహోల్లాసమంగునని నాకు గట్టినమ్మకము. ఒక భాష శాస్త్రీయముగా అభ్యసించినచో మిగిలిన భాషలు సులభతరములు.

విచారించుచో హిందీ, గుజరాతీ, సంస్కృత భాషలు ఏకభాషయే అని అననగును. అట్లే ఫారశీ అరబ్బీ భాషలు ఏకభాష. ఫారశీ భాష సంస్కృతమువంటిదయ్యును, అరబ్బీ భాష హీబ్రూవంటిదయ్యును ఈ రెంటికిని ఒక దగ్గర చుట్టరికము ఉన్నది. ఈ రెండును ఇస్లాము మతముతో వర్ధిల్లినవి. ఉరుదు భాషను వేరుగా ఎన్నను. ఏలనగా, దాన హిందీ వ్యాకరణ సమావేశమును, ఫారసీ అరబ్బీ పదములును గలవు. గుజరాతీలోగాని, హిందీలోగాని, బంగాళీలోగాని, మరాటీలోగాని మంచి ప్రవేశము ఉండవలయు నన్నచో సంస్కృత మెటులు రావలయునో, ఉరుదులో పాండిత్యము సంపాదించవలయునని ఫారసీ అరబ్బీలు రావలెను.

(గాంధీజీ ఆత్మకథనుంచి)

- అను. వేలూరి శివరామశాస్త్రి

మన వర్తక వ్యాపారము

ప్రాచీన కాలం నుంచి ఇప్పటికి రమారమి రెండువందల సంవత్సరల క్రిందటిదాకా మన ఆంధ్రదేశ వర్తక వ్యాపారం సాగించేటటువంటి వర్తకులకు చిత్రమైన పేరులు ఉండేవి. ఈ వర్తకులను దేశి, పరదేశి, నానాదేశి అనేవారు. దేశివర్తకులు మనదేశంవారు. హిందూదేశములోని ఇతర దేశాలనుంచి వచ్చే వర్తకులను పరదేశి, నానాదేశి అనేవారు. ఈ వర్తక సమూహానికి అంతకు - వారు దేశీయులయినారే, పరదేశీయులైనసరే - ఇంకొక పేరు ఉంది. అది ఏమిటంటే చాలు మూల సమస్తదేశాల పెక్కండ్రు. ఇవి మన పూర్వులు వ్యాపారంచేసే వర్తకులకు పెట్టిన పేరులు. దేశి, పరదేశి వర్తకులు ఉభయులను ఉభయదేశి అని కూడా వ్యవహరించేవారు. ఈ వర్తకులు నాటున దేశంలోను, సముద్రంమీద కూడా వ్యాపారం సాగించేవారు. ముందు నాటున సాగిస్తూ వచ్చిన వ్యాపారాన్ని గురించి చెపుతాను.

పూర్వం మనదేశములో ఇప్పటిలాగ రోడ్లూ, రహదారులూ ఉండేవి కావు. దేశము అడవి బలిసి ఉండేది. అడవిదారులలోనూ, డొంక తోవలలోనూ ప్రయాణం చేయువలసి వచ్చేది. దారులు కొట్టే దొంగలు ఎక్కువ. అడవి జంతువుల ఉపద్రవం ఉండేది. ఈ కారణం చేత వర్తకులు గుంపులు కట్టి వేళ్ళేవారు. ఒక్కొక్క గుంపులో వందల కొద్దీ ఉండేవారు జనం. ఒక్కొక్క వర్తకుడు వర్తకునివద్ద వంద మందీ, వందయేభై మందీ నౌకరులు ఉండేవారు. ఈ సరకులను సాధారణముగా ఎడ్లమీదా,

గుర్రాలమీదా, కంచరగాడిదలమీదా తీసుకువెళ్ళేవారు. ఒక పెద్దగోనెపట్టాను ఈ చివరా ఆ చివరా సంచులుగా కుట్టి, వాటి నిండా ఉప్పు, ధాన్యము మొదలయిన సరకులతో నింపి దానిన జంతువుల వీపుమీద కుడివైపు కొకసంచి, ఎడమవైపు కొకసంచి ఉండేటట్టు అడ్డముగా వేసేవారు. దీనికి పెరికె అని పేరు. ఈ విధముగా వ్యాపారం చేసే వారిని పెరికెలని, పెరికెసెట్లని అనేవారు. ఒక వర్తకుల గుంపుబయలు దేరిందంటే దానిలో ఎంతో మంది వర్తకులు, వర్తకుల నౌకరులు, ఎన్నో రకాల సరకులు, ఆ సరకులు మోసే జంతువులు, దారిలో దొంగలు కాన అడవి జంతువులు కాని అడ్డగిస్తే తమ్ము తాము కాపాడుకోడానికి అవసరమైన ఆయుధాలు, దారి మకాములలో వంట చేసుకోడానికిఅవసరమైన ఆహారసామగ్రి - ఒకటేమిటి, అదొక వర్తకసేన. ఈ విధమైన వ్యాపారుల సమూహానికి సాతు అని, బిడారు అని పేర్లు. దగ్గర ఊళ్ళకు, దగ్గర సంత సావిళ్ళకు సరకు బండిమీద వెళ్లేది. ఆత్మరక్షణకోసం పూర్వకాలములో దూర ప్రయాణాలకు, వర్తక వ్యాపారానికి ఇట్టి పరస్పర సహకారమూ, గుంపుగా ఏర్పడడమూ అవసరమయ్యేది. జంతువుల మెడలలో గంటలు కట్టి వాటిని చిత్రచిత్రముగా అలంకరించేవారు.

ఇది ఇట్లా ఉండగా ఒక్కొక్క దినుసుతో వ్యాపారం చేసేవారు ఒక్కొక్క సంఘముగా ఏర్పడేవారని ఇదివరకు చెప్పితిని కాదూ ? ఇట్టి సంఘాలను సంస్కృతములో శ్రేణులు అనేవారు ; ఇట్టి వ్యాపారసంఘాలు శాతవాహనరాజుల కాలంనుంచి చాలా ఉండేవి. ఇవి ఇప్పటి ట్రేడ్ యూనియనుల వంటివి. కట్టుదిట్టమైన పద్ధతులతో వీటిని నడిపేవారు.

సాధారణముగా సరకు అమ్మకమూ కొనుగోలూ విశేషముగా పెద్ద పెద్ద సంతలలోను. తిరునాళ్లోను, తీర్థములలోను జరిగేది. సంతకు అమ్మ వచ్చే సరకుమీదా, సంతనుంచి వర్తకులు కొని తీసుకపోయే సరకు మీదా

పన్ను తీసేవారు. ఈ పన్నుకు సుంకము అని పేరు. ఈ పన్ను వసూలు చేసే ఉద్యోగులు సుంకరులు.

వ్యాపార ప్రయాణాలలో వర్తకులు గోదావరి, కృష్ణ, తుంగభద్రలవంటి నదులు దాటవలసివచ్చేది. వర్తకులు వీటిని ఒక రకం పడవలమీద దాటేవారు. ఈ పడవలు మనకు ఇప్పుడు పరిచయమైన కఱ్ఱ పడవలూ కావు. స్టీమరులూకావు అవి గుండ్రనగా చెరకు పెనాలలాగ ఉండేవి. వాటిని ఫేముతో అల్లి వెలుపలివైపు దున్నపోతు చర్మముతోను, పుట్లు గుండ్రముగా తిరుగుతూ ఇవతలి ఒడ్డునుంచి అవతలి ఒడ్డుకు పోయేవి. రేవులలో ఇట్టి పుట్లు ఉండేవి. ఈ పుట్లమీద రేవు దాటే వర్తకపు సరకుమీద పుట్టి సుంకాలు వసూలు చేసేవారు. మన దేశంలోని నదులలోను చిన్న ఏళ్ళలోను 1800 ల వరకు రేవులు దాటడానికి ఇవే పడవలు. కాకాతి ప్రతాపరుద్రదేవ మహారాజును ఢిల్లీకి తీసుకొని పోయేటప్పుడు తురక సర్దారులు గోదావరి దాటించినది. ఈ రకము పడవలలోనే.

ఇక సముద్ర వ్యాపారాన్ని గురించి చెపుతాను. వెనుకటి ప్రసంగాలలో మీకు కొద్దిగా సూచించాను. శాతవాహన, ఇక్ష్వాకు, చాళుక్య, కళింగ, గాంగ రాజవంశాలవారి కాలములో మన దేశవర్తకులు సముద్రాలమీద సబురులు చేసి తూర్పుదేశాలతోను, ద్వీపాలతోను వర్తక వ్యాపారంచేసేవారని, హిందూదేశ వర్తక వ్యాపారములో ఒక చిత్రం ఉంది. అది ఏమటంటే, ప్రాచీనకాలంనుంచి మనదేశము పడమటి దేశాలతో జరుపుతూవచ్చిన వ్యాపారమంతా పడమటిదేశ వర్తకులవశాన ఉండేది. వీరలో మొదటివారు ఆఫ్రికాలోని ఈజిప్టుదేశంవారు, తరువాతి వారు గ్రీకులు, తరువాతివారు అరబ్బులు. క్రీస్తుశకం పదకొండు, పన్నెండు శతాబ్దుల దాకా పడమటి దేశాలతోడి హిందూదేశ వ్యాపారమంతా అరబ్బుల వశంలోనే ఉండేది.

తూర్పు దేశాలతోడి వ్యాపారమంతా హిందూదేశపు వర్తకుల వశాన ఉండేది. ప్రాచ్యదేశ వర్తక వ్యాపారం సాగించిన మొదటి హిందూదేశీయులం మనమే - ఆంధ్రులమూ, కళింగులమూను. తరువాత ద్రావిడులు అటువెనుక గుజరాతీలు, ఆ పిదప బంగాళీలు మొదలైనవారు ఈ వ్యాపారములో పాల్గొన్నారు. మనము ఈ వ్యాపారములో ముందడుగు వేయడానికి కారణం ఇది. మన ఆంధ్రదేశము చాలా భాగము సముద్రతీరాననే ఉంది. నదీతీరాన ఉన్నవారికి సాధారముగా ఈత ఎట్లా వస్తుందో ఆ విధంగానే సముద్రపు ఒడ్డున నివసించేవారికి సముద్రం మీద సబురులు చేసే సాహసం సహజముగా అలవడుతుంది. సముద్రతీరవాసులు గొప్పనావికులు అవుతారు. అదీగాక దక్షిణ హిందూదేశంలోని మొదటి మహారాజ్యం మనదే.

మన దేశములో సముద్రపు ఒడ్డున ఎన్నో కరపట్టణాలు ఉండేవి. రేవు పట్టణాలను పూర్వం కరపట్టణా లనేవారని చెప్పితిని కాదూ ? మన దేశముతో వర్తక వ్యాపారం సాగించిన పశ్చిమదేశాల నావికులూ, భూగోళ శాస్త్రజ్ఞులూ ఇటువంటి కరపట్టణాలు మన దేశంలోనివి ఎన్నిటినో చెపుతారు. ఇట్టివారిలో పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి అనే గ్రంథము వ్రాసిన యతడు, ప్లీని లాటెమీ అనేవారు ముఖ్యులు. వీరిలో కొందరు మన హిందూదేశముతో ఓడ వ్యాపారం చేసినవారు చెప్పిన విషయాలు విని వ్రాసినవారు. వీరు అరబ్బీ వ్యాపారులకంటే పూర్వులు. వీరు విదేశీయులు అవడంచేతను, మనదేశపు పేరుల ఉచ్చారణ వారికి వికృతముగా ఉండడంచేతను, వారికి ఈ పేరులు కొత్తవి అవడంచేతను అవి ఆవిదేశీయుల పలుకుబడిలో మారిపోయినవి. అందువల్ల మన దేశంలోని వని వారు చెప్పిన కరపట్టణాలలో ఏ వొకటి రెంటినో తప్ప మిగిలినవాటిని గుర్తించడమే కష్టముగా ఉన్నది. పొదుకె, కొట్టిన్, మనర్ఫ, కటికర్దమ, అలొసిగ్నె, కన్నగర

- ఇట్టివి చాలా ఉన్నవి. వారు చెప్పిన దేశాలు నదులు గుర్తించడములో కూడా కష్టము ఎక్కువై ఊహల మీద ఊహలు పెరిగినవి. టిన్న, మైసోలస్ అనేవి మన దేశములోని నదులట. మైసోలియా అనేది మన దేశములోని ఒక రాష్ట్రమట. మరి ఇవి ఇప్పుడు వేటికి వర్తిస్తవో, మనకు వారు చెప్పిన కరపట్టణాలలో గుర్తింప గుదిరినవి రెండేరెండు ; ఒకటి కంటకస్సిల, రెండవది కొడ్డూర. కొంటకస్సిల ఇప్పటి ఘంటసాల ; కొడ్డూరు ఇప్పటి బందరు దగ్గర గూడూరు. రెండూ కృష్ణాజిల్లాలోనివే ; కృష్ణానదీ ముఖద్వారం దగ్గర ఉన్నవే. దంతపురము అనేది కళింగంలోని ప్రముఖమైన కరపట్టణము. అది ఎక్కడ ఉన్నదీ ఇంకా తెలియదు. ప్రధానముగా ఈ మూడు రేవులనుంచి ఆంధ్ర వర్తక వ్యాపారులు తూర్పుదేశాలకూ, ద్వీపాలకూ వెళ్ళేవారు.

శాతవాహనరాజుల కాలంనుంచి రెండుమూడు వందల సంవత్సరాల క్రిందటిదాకా మన ఆంధ్రదేశము ఇతర దేశాలతో సాగించిన ప్రధాన వ్యాపారము నూలుబట్టలూ, అద్దకపు బట్టలూ, అతిసుందరమైన పలుచని మల్లుసెల్లాలూను. శాతవాహనరాజుల కాలములో ఇవి యూరోపు ఖండ దేశమైన ఇటలీకూడా వెళ్ళేవి. ఆ కాలములో రోము చక్రవర్తులు ఇటలీ పాలిస్తూ ఉండేవారు. మనదేశపు వర్తకులు రోము వర్తకుల వద్ద నుంచి బంగారము తీసుకొని బట్టలు ఎగుమతి చేసేవారు. ఈ కారణంచేత రోము చక్రవర్తుల నాణెములు మన దేశములో ప్రత్తి పండే ప్రాంతాల గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతానను, కడపజిల్లాలోను దొరికినవి. ఆ విధంగానే మన పూర్వ చాళుక్య రాజయిన విమాలాదిత్యుని అన్నగారు శక్తివర్మ బంగారు నాణెములు ఆరకాను, సయాము దేశాలలో కనబడినవి. వీటిని బట్టి మనదేశ వర్తకులు శాతవాహనుల కాలంనాడూ, అటు తరువాతను కూడా తూర్పుదేశాలతో వర్తకము సాగిస్తూ వచ్చినట్లు ధ్రువపడుతున్నది.

తూర్పుదేశాలనుంచి, ద్వీపాలనుంచి మన సరకు చీనావారి ఓడలలో వచ్చేది. ఈ ఓడలు చీనాదేశం నుంచి హిందూమహాసముద్రములో మలబారు తీరందాకా సబురులు చేసేవి. ఈ చీనావారి ఓడలకు జోంగులని పేరు. వీటిని ఇంగ్లీషులో జంక్స్ అంటారు. వీటికి ఒక్కొక్క దానికి మూడేసి, అంతకు ఎక్కుగాను వెదురు వేపబెత్తములతో అల్లిన తెర చాపలు, యాత్రికులు ఉండడానికి వీటిలో గదులు ఉండేవి. జోంగులు పెద్ద ఓడలు. ఒక్కొక్క పెద్ద ఓడకు వేయేసిమంది కళాసులూ, నావికులూ ఉండేవారు. వీరిలో విలువిద్యలో ఆరితేరినవారు కూడా ఉండేవారు. ఒక్కొక్క పెద్ద ఓడతో చిన్న పడవలు మూడు నాలుగు ఉండేవి. మన దేశాన్నుంచి తూర్పు దేశాలకు సంవత్సరానికి ఒక్కసబురు సాగేది.

మాండలిక యుగములో సముద్రవ్యాపారము మందగించినది. దానికి కారణం ఇది. ఆంధ్రదేశపు కరపట్టణాలకు సరకులు వేసుకొని వచ్చిన ఓడలను సముద్రప్రాంతాన ఉన్న మాండలికులు కొల్లగొట్టేవారు; ఎక్కువ సుంకాలు తీసేవారు. ఎప్పుడయినా ఏ గాలితుపానులకయినా వర్తకపు టోడలు ఒడ్డుపట్టినా, బద్దలయిన ఒడ్డుకు కొట్టుకొనివచ్చినా సరకు బలవంతాన తీసుకొని వర్తకులను హింసించేవారు. ఈ కారణాన మాండలికయుగము చివరికాలములో ఆంధ్రదేశపు రేవులు ఎన్నో చాలా పాడయిపోయినవి. ఇటువంటి స్థితిని గమనించి ఓరుగంటి గణపతి దేవ మహారాజు పూర్వాంధ్రదేశాన్నంతా జయించిన తరువాత సముద్రాల మీద ఓడ వ్యాపారముచేసే వర్తకులకు అక్రమాలు ఏవీ జరగకుండా రక్షిస్తానని అభయహస్తం ఇచ్చాడు ; ఎగుమతి, దిగుమతి సరకులమీద సుంకాలు నిర్ణయించాడు.

గణపతిదేవ మహారాజు కాలములో గుంటూరుజిల్లాలోని

మోటుపల్లి గొప్ప రేవుపట్టణము. అప్పటికి ఘంటసాల, గూడూరు రేవుల ప్రభ తగ్గిపోయింది. వెనీసు దేశస్థుడయిన మార్కొపోలో అనే యాత్రికుడు క్రీ.శ. 1280 ప్రాంతాన ఈ మోటుపల్లి రేవులో దిగి ఇక్కడి మల్లు సెల్లాలు చూచి అవి సాలీనిదారముకంటెను సన్ననైన దారముతో నేసినవి, ఇటు వంటి మల్లు సెల్లా తాను ఎక్కడా చూడలేదని వ్రాశాడు. కాకతీయ సామ్రాజ్యము క్రీ.శ. 1313 లో కూలిపోయిన తరువాత మరల ఓడల వ్యాపారానికి దెబ్బ తగిలింది. మోటుపల్లికూడా తురక సర్దారుల, మాండలికుల చేతిలో పడి పూర్వపు వైభవం గోల్పోయింద. తూర్పుదేశాలతో వర్తకం ఏ మాత్రంగానో జరుగుతూవచ్చినా కొండవీటి రెడ్డిరాజులు పూర్వాంధ్రదేశాన్ని వశంచేసుకొని తమ అధికారం బాగా స్థాపించినదాకా తెలుగు దేశపు ఓడల వ్యాపారం బాగుపడలేదు.

- మల్లంపల్లి సోమశేఖరశర్మ

సర్వమంగళ

నిన్ను వెదుక్కుంటూ వచ్చానమ్మా!

ఇంతదూరం, ఎక్కడో కృష్ణా తీరాన్నుంచీ .... చల్లని తల్లివి .... కష్టాలన్నీ విని, కడుపులో పెట్టుకు ఆదరిస్తావని, నీలో కలసిపోదామని వచ్చానమ్మా!

సహించారు ; మనసులో ఎంత అసహ్యపడుతున్నా, బయటికి కనబరచకుండా, ఆదరంతో చూస్తూ, తమ ఔదార్యాన్ని ప్రకటించుకుని, లోకంచేత 'ఆహా' అనిపించుకుని, కోటి యజ్ఞాల ఫలం దక్కినట్టు, మురిసిపోయినారు. కాని అర్థం చేసుకుని, అనుతాపంలో పాలు పంచుకోలేని ఈ లోకానికి... ఎంత దూరమైపోతే మాత్రం ఏమమ్మా.

నావాళ్ళే నాకు కానివాళ్లైనప్పుడు.... పంచ ప్రాణాలు, మమకారం నిల్పిన వాళ్ళే, వంచనచేసి తూలనాడినప్పుడు... కోరికలు, ఇక ఈ జన్మకు తీరవనే నిరాశ కుదురుకుపోయిన తరువాత.... బ్రతికి మాత్రం ఫలమేమున్నదమ్మా!

తీరా.... ఇక ఎన్నటికీ కనపడనని తెలిసిపోయిన తర్వాత .... అన్నయ్య, పాపం, తల్లితోడూ కనుక.... విచారపడతారు. నా జీవితం అంతా అడవికాచిన వెన్నెల అయిపోయినప్పటికీ... నా బాధలన్నీ నేను భరించుకుంటూ, ఇంట్లో చేదోడు వాదోడుగా ఉండీ, అక్కరకు

అడ్డుపడుతూన్నన్నినాళ్ళూ.... ఆయనకేమీ చీమంత అయినా నా గొడవ పట్టలేదు ; ఇప్పుడు మాత్రం, ఇబ్బంది వచ్చినప్పుడు ఆదుకునేందుకు మనిషి లేకపోయిందికదా అని నన్ను తలుచుకుంటాడేమో ; అదైనా ఎంతసేపులే... వదిన కౌగిలిలోకి వెళ్ళిపోయిన తరువాత లోకాన్నే మరచి పోతాడు.

మా చెల్లెలు, జానకా, అభం శుభం దానికి ఏం తెలుసు ? దాని పెనిమిటి నాకు చేసిన అపకారం.. కాదు, ఉపకారం... దానికి తెలిస్తే... ఓర్చుకుని, భరించగల జాణతనం... ఆ అమాయకురాలికి, పసిపాపకు.. ఏదమ్మా ?

''వయసు మళ్ళుతూన్నవాడు... కొరకరాని కొరవి... ఆ నికృష్టుడికి బంగారంవంటి పండువంటి తల్లిని కట్టిపెట్టవద్దు... ఇది సుతరామూ కూడదు.... రెండో పెళ్ళివాడితో అది బావుకునేది ఏమిటి ? అని, నేను పట్టుబట్టి, ఆ సంబంధం మానిపించాలని, శాయశక్తులా అన్నయ్యతో పోరుపెట్టాను ; కాని, నా మాట వింటాడా. పిల్ల సుఖపడుతుందట !... ఆ ఆ మాటకు అర్థం ఉన్నదా ? ఆడది సుఖపడటం అంటే ఏమిటో ఆ మొగరాయుడుకు తెలుసునా ? ముద్దినుసు నగలూ చీరెలూ, ఇనపపెట్టెలో నిండు సంచులూ చూసుకుంటే కడుపు నిండిపోతుందా ? - పైగా, నేను యింకా ఏమన్నా అనిపోతానేమోనని... 'మొదటి పెళ్ళివాడని... పిల్లవాడు చిన్నవాడని... నిన్ను ఇస్తే.... ఏమైంది చెప్పు... ఆయుర్దాయం ఉండాలి, సుఖపడి అనుభవించే యోగం ఉండాలి కాని...' ఈ మాటలకు నా నోరు కట్టుబడింది... మనసు చిల్లులు పడిపోతే మాత్రం... అతనికేం ?

మూడు ముళ్ళూ పడ్డాయి. పడ్డ ఆరుమాసాలకే పిల్ల ఈడేరింది. వడసారం, పదమూడో ఏడు సగపాలైనా గడవలేదు. పిల్ల ఏపరికాదు

కాకపోతేనేం. మూడు ముచ్చట్లూ తీరిన తరువాత, ఒక్క క్షణం ఉండనిచ్చాడా పిల్లను నట్టింట! గద్ద తన్నుకుపోయినట్టే - నేను మళ్ళా నోరు చేసుకున్నాను. అప్పుడు గూడా... అన్నయ్యతో, నెమ్మదిగా... ఇంకో సంవత్సరమన్నా ఆగితే మంచిదని, బావగారితో ఎలాగైనా చెప్పి ఒప్పించు ; పిల్ల కొంచెం రెక్కొంటేగాని, ఇప్పటినుంచీ కాపురం ఏం దిద్దకుంటుంది? ఇంకో దిక్కులేదు, వంటరి గాళ్ళాయెను.....' అని బ్రతిమాలుకున్నాను. అన్నయ్యకే ఈ ఊహ తట్టవలసింది... పోనీ, వినైనా హర్షించడా అనుకుంటే, అలా కాకపోగా, పైపెచ్చు ఎదురు తిరిగి.. 'ఎంతకాలం నోట్లో వేలువేసుకు కూర్చుంటా డనుకుంటావు. ఆడదిక్కు లేకనే, గూట దీపం పెట్టేవాళ్ళు లేకనేగా... వెంటనే పెళ్ళి చేసుకుంది... ఏం, తీవెళ్ళిందా ఏం.. దాని ఈడుకు నేను అమ్మకు కడుపున పడ్డానుట.. ఇంకా ఆయన పుణ్యమా అంటూ మంచివాడు కనుక, ఇంతకాలం ఆగాడు... మనం చూడటం లేదూ, లోకంలో.. వెంటనే .... పసుపు బట్టలతోనే తీసుకువెళ్ళి కాపురం పెట్టుకున్న వాళ్ళు ఎంతమంది లేరు ? అలా చేస్తే మాత్రం, వర్ధనగలిగే వాళ్ళుమా ? నీ మాటలకేం ? నట్టింట కనబడతుతూన్నన్నాళ్ళూ... ఎంత వయసువచ్చినా, మనకు పసిపిల్లే - అవతలవాళ్ళ కష్టసుఖాలు కూడా కొంచెం యోచించవద్దూ...' అంటూ నన్ను గదమాయించి, బావమరిదిని వెనక వేసుకు వచ్చాడు. నేను అనేదేముందీ ఇక... అన్నింటికీ తల ఊపవలసిన దాన్నే నాయెను ; పోనీ, చెప్పి చూస్తే పెళ్ళివారైనా ఉన్నారా అంటే ఇరు పార్శ్వాలా నా అన్నవారులేరు.. ఇటు మా అన్నయ్యా... అటు మా జానకి మొగుడు పూర్ణయ్య శాస్తుర్లూ... ఎవరి యింటికి వారే పెద్దలు!

సరే, ఆకాస్త మొక్కు కూడా తీరిపోయింది. గది అలంకారాన్నీ ఇరుగమ్మా, పొరుగమ్మా ఎవరో చేయిచేసుకుని కానిచ్చేశారు. నాకు, ఒకసారి

తొంగి చూడ్డానికైనా మనసు ఒప్పలేదు. పిండివంట దగ్గర కూర్చునంతసేపూ, కంట నీరుపెడుతూనే ఉన్నాను. పొగపోయి కళ్ళు ఎర్రబారిన వనుకున్నారు - పేరంటాళ్ళు - మనసు ఎంత కుమిలి పోతూన్నదో ఎవరూ గ్రహించలేదు... నయమే అదీని!

ఇక... ఆ కాపురం ముచ్చట్లు ఏమని చెప్పేది. మూడు నిద్దర్లూ కాగానే, తెల్లవారితే మంగళవారమైనా, నిమిషం నిలవకుండా తర్లించుకు వెళ్ళిపోయినాడు... తీసుకువెళ్ళి కత్తులబోనులో ఇరికించాడు. మెదలడానికి వీలులేదు. కూరనార అమ్మేవాళ్ళతోనైనా మాట్లాడకూడదు. మగపురుగు కంటపడరాదు... మా ప్రక్కవీధిలోనే ఉన్నా... పోయి ఒక మారు కంటనైనా చూద్దామంటే, నాకు అసలు పొరాగత్తెం ఉందీ! ఇక, బండిలో కాలుపెట్టబోతూ, నేను మడిగట్టుకుని, ఊరగాయలు సర్దుతూంటే ఎదురుకుంటూవచ్చి, నన్ను కావిలించుకుని.. 'ఒక్కర్తెనూ ఉండలేనే రోజా వచ్చి చూసి వెళుతూండవే అక్కయ్యా ... మిమ్మల్నందర్నీ విడిచి వెళుతూంటే, ఏమిటో తగని దిగులుగా ఉందే... అనిబావురు మన్నది. నేనూ, అధైర్యపడితే కుర్రది మరీ బెగ్గటిలిపోతుందని, రొమ్ముకు అదుముకొని సముదాయించాను.చెపుదామనుకున్న నాలుగు మాటలు చెప్పకముందే...అన్నయ్య, బండివాడు తొందర పడుతున్నాడని వచ్చి మా కిద్దరికీ ఎడబాటులు చేశాడు. ఆ తరువాత వాడన్నా తిరిగి చూశాడా-నేను అనుక్షణం పోరుతున్నా- ఏముంది చూసేందుకు-వాళ్ళుకాపురం వాళ్ళు చేసుకుంటున్నారు. చీటికి మాటికీ- ఇట్టే అట్టే మనం గనక వెళుతూంటిమాయెనా, తనమీద ఏం నేరాలు చెపుతూందో- మనకేం దోచిపెడుతూందో అని ఆయన అనుమానపడవచ్చును- లేనిపోని - కలతలు తెచ్చిపెట్టడం ఎందుకూ- ఇలా సాకులుచెప్పి తప్పించుకుంటూండేవాడు.

వారం రోజులైంది. వాకిట్లో... ప్రొద్దున్నే ముగ్గు వేస్తూండే వేళకు శాస్తుర్లు వీభరాతి పెండెకట్టుతో ఊడిపడ్డాడు...'అంబయ్య ఇంకా నిద్రలేవలేదటమ్మా...' అని రోడ్డు మీద నిలుచునే ఓపాల్లు కేక పెట్టాడు. పలుదోముపుల్ల తిరితిప్పి నములుకుంటూ, అన్నయ్య కేక విని, లోపలి నుంచి వచ్చి... ఆయన్ను రమ్మని తల విసిరాడు. మెట్లు ఎక్కుతూ, నా వంక మోరపెట్టి... 'దానికి కొంచెం నలతగా ఉందమ్మా...చెయ్యి తీరిక అయిన తరువాత ఒక్కసారి వచ్చి చూసి- అని అన్నయ్యతో ఏదో ఈమాట ఆ మాట ... కి వెళ్లిపోయినాడు.

వినేటప్పటికే నాకు కాళ్ళూచేతులు ఆడలేదు. ముగ్గుబుట్ట అక్కడే పారేసి పరుగెత్తాను. పోయిచూద్దును గదా, పిల్లది బొత్తిగా లో జెడ్డది. గడపలో కాలు పెట్టినప్పటి నుంచి మూసిన కన్ను తెరవడం లేదుట... ఆయన, ఒంటి పూట ఇంత ఉడకేసుకు తింటూ... దానికి జావ కాచిపడేస్తూ... జానకికి ప్రాణం లేచి వచ్చింది. ఏముందీ, ఒకరినొకరు కావిలించుకొని... దాన్ని చూసి నేను ఏడవా నన్ను చూసి అది ఏడవా! ఇంతలో అన్నయ్య కూడా వచ్చాడు. స్థితిగతులు తెలిసిన తరువాత వాడికీ వెష్టబుట్టింది. ఆ పళంగా పోయి డాక్టరును తీసుకొచ్చాడు. టైఫాయిడ్ అని తేలింది.

మా యింటికి తక్షణం తీసుకువెళ్దామన్నాను. ఆ పిసినారికి ఖర్చు తగ్గడమే కావలసింది... వెంటనే సరే అన్నాడు. కాని, ఒక చిక్కు వచ్చింది. మా వదినె, కార్యం అయిపోయిన మర్నాడే పురిటికి వెళ్ళింది. అన్నయ్య ఆ సాయంకాలమే దొరతో సర్క్యూటు వెళ్ళాలట...సెలవు దొరికే నౌకరీ కాదాయెను. మళ్ళీ తిరిగిరావడానికి ఏ ఇరవై రోజులో పడుతుంది... అంతవరకూ, రెండో దిక్కు లేకుండా నేను నిభాయించడం ఎలా? ఏమిటి

చేయడం ఇప్పుడు? నాకు ఎంత మాత్రమూ ఇష్టం లేకపోయినా, ఆ మానవుడు, ఉండమని అనకపోయినా, తప్పింది కాదు. అది మళ్ళాలేచి ప్రజల్లో పడేదాకా అక్కడే నా కొలువు.

తిరిగి వచ్చి, మడి ధోవతులు పట్టుకుని వెళ్ళి ... వేగిరం స్నానం చేసి వంటచేశాను. అన్నయ్య, మొగమాటం చంపుకుని ఆ పూట అక్కడే భోజనం చేసి సాయంత్రం బండికి వెళ్ళిపోయాడు.

క్రమంగా, ఆ రోజు కారోజు ముసలాయన రుసరుసలు మాని, కొంచెం ముఖం విప్పారి ఉండేవాడు. షడ్రసోపేతంగా చేసి పెడుతూంటినాయెను; ఏం తీపెళ్ళిందా... వేళకు అన్నీ అమరుస్తూంటే; మొదటిలో మాట పలుకూ లేకపోయినా, ఆనాటి కానాడు, అదీ ఇదే కనుక్కోడం... భోజనం ముందర లోకాభిరామాయణం వేయడం... ఆషామాషీలాడటం... నన్ను నవ్విస్తూండటం... మొత్తానికి, నా చేత అక్కరకు వచ్చినట్టే ఉంది. మనిషికవళికలో కొంత మార్పు కనిపించింది. నాకుకూడా, మొదట ముళ్ళమీద వున్నట్టుండి, ఎప్పుడు ఇవతల పడదామా అని ఉన్నా...పోనుపోను, కొంత బెరుకు తీరింది.

మూడువారాలు గడచిపోయినవి. జానకి జబ్బు మళ్ళుముఖం పెట్టింది. పథ్యం పెట్టి, నేను మా యింటికి వద్దామనుకుంటున్నాను. కాని, మన యత్నమూ, తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందని-కావలసిన కారణార్థం వేరుగా ఉండగా... ఇంతకూ, అన్నీ అల్లా ఒనగూడాయి. అన్నయ్య ఇంకో పదిరోజులదాకా రానని, టపా తీసుకు వేళ్ళే జవానుచేత కబురంపించాడు. అందాకా అక్కడే ఉండమని జానకి పట్టు పట్టింది. మా మరిది కూడా... ఏకళనున్నాడో...బలవంతం చేశాడు. పోనీలే, వాళ్ళు అంత

ప్రాధేయ పడుతూన్నప్పుడు... అక్కడ మాత్రం మించి పోయేదేముంది. ఒంటరిగా ఉండాలిసిందే కదా, అన్నయ్య వచ్చేదాకా; పోనీ, ఈలోపుగా పిల్లకు జవపట్టేదాకా ఉండవచ్చునని... అట్టే బెట్టు చెయ్యకుండా మెత్తబడ్డాను.

పడిలేచిందా, అప్పుడే పొయిలాకటకు రానియ్యడానికి నేను ఒప్పుకోలేదు. ఏం గంపచాకిరీ ఉందని? ముచ్చటగా ముగ్గురికి వండి వార్చుడం అదోపనా ? పైగా, మా తల్లి, లేచి తిరుగుతూండటమే నాకు కొండంత సత్తువ తెచ్చింది. జిహ్వ చచ్చి ఉందేమో కావలసినవి అడిగి చేసిపెట్టేదాన్ని...

తిన్నది వంట పడుతూన్నకొద్దీ- బాగా తెప్పరిల్లి కోలుకుంటూంది జానకి; సంధ్యపడగానే, ముందు దానికి అన్నం పెట్టేసే దాన్ని-అంగట్లో మెతుకులు అంగట్లో ఉండగానే,చెయి కడుక్కోడంవ్యవధానం పక్క మీద ఒరిగేది-పగలు కునకడానికి వీలులేదేమో-మళ్ళా పొద్దు పొడిచేదాకా ఆదమరచి నిద్రపోయేది. నేను, ఆయన కోసం కనిపెట్టుకొని ఉండి, తిన్న తరువాత-పిండో, పాడో నోట రొట్టుకుని- మూతలు పెట్టేసి - వసారా అంచున మాలతీ పందిరికి దగ్గరగా పక్కవేసుకునేదాన్ని; జానకి పక్కగదిలో పడుకునేది- కటకటాల తలుపు కనుక- పిలిస్తే పలకడానికి అందుబాటు. ఆయన- ఇంటిముందు- ఆరుబయట పడుకునేవాడు.

-అర్ధరాత్రి-చప్పున మెళకువ వచ్చింది. పిండారబోసినట్టు వెన్నెల- ఆలకించి చూశాను; అవతలపక్క, కునిసందులో- కొంచెం అలికిడి వినపడ్డది; నాళ్ళనడుమ ; దొంగాతోడుమోతూ రావడానికి వీలులేని స్థలం ఏమిటో చూద్దామని- లేచి; మెల్లిగా ఆ వేపుకి వెళ్ళాను;

మందారచెట్ల నీడలు పడుతూ నేలంతా, చీకటీ వెలుతురూ మాసికల చదరంగ పాళీలాగా ఉంది. మొదట ఏమీ కనిపించలేదు. మళ్ళా పరకాయించి చూశాను; చెట్లచాటున ఎవరో ఉన్నట్టుంది. కాళ్ళు చూచాయగా కనిపించినవి. ఒళ్ళు ఝల్లుమన్నది. గుండె గొంతుకలోకి ఎగదట్టికెక్కుమని- దగ్గు, అరుపు కలసి - కేకపెట్టాను నోట- అరవడానికైనా- మాటరావడంలేదు. కాళ్ళు పాతుకుపోయినాయి-వెర్రి భయంలో రెప్ప ఆడలేదు. గుడ్లు అప్పగించి చూస్తూ నిలబడిపోయినాను.

- మనిషి తొందరగా నడచి పోతున్నప్పుడు - దొడ్డితలుపు ; ధోపేలున పడ్డది . మామరిది, చెట్లమాటు నుంచి, నిదానంగా, నా దగ్గరికి వచ్చాడు. నన్ను చూసి-పోల్చుకోక ముందు ఉలికిపడి- అంతలో తెప్పరిల్లాడు . భార్య ఏమోననుకొని భయపడి ఉంటాడు. మొదట అవతల మనిషిని నేను గుర్తించాను. మా యింట్లో పనిచేసే ముత్యాలు.

' ఇక్కడ నిలుచున్నావేం-నిద్రలో నడిచి వచ్చావా', ఆయన ఏమీ చలించకుండా- మామూలుగా అడిగాడు. నేనేమీ సమాధానం చెప్పకుండా ఊరుకున్నాను. ఒక్క నిమిషం నన్ను పరకాయించి చూసి 'పోయి పడుకో' అని, ఏదో గొణుగుకుని వెళ్ళిపోయినాడు.

నేను, వెళ్ళి, మళ్ళా మంచంమీద పడుకున్నాను, నిద్రరాదు-- ఆలోచనలన్నీ సముద్రకెరటాల లాగా నన్ను అవరించి ఊపివేసినవి. పక్కకుదరక చాలాసేపు అటూ ఇటూ దొర్లాను. ఎంతో సేపటికి కాని, ఎటో అటు పాలు పోయింది కాదు. నిశ్చయానికంటూ వచ్చిన తరువాత కూడా--తలచుకోవడం, దద్దరిల్లి పోవడం, - ఎలాగైతేనేం, మనసును ఒప్పించాను, జయించానన్న ఉత్సాహంలో - చిరునవ్వు పెదవులపైన

మొలకెత్తుతూండగానే- జోగిపోయినాను.

ఎంతో సేపటికి మళ్ళా మెలకువ వచ్చింది. తట్టి-గిలిగింతపెట్టి లేపినట్లైంది. కళ్ళు తెరిచాను. వెన్నెల వుసకవారింది- చుక్క పొడవబోతూంది. చూపు-మరల్చి- ఆ- వేపుకు-సారించాను. నాకాళ్ళ దగ్గర- పాదం పట్టుకుని కదుపుతూ- మా మరది కూర్చుని ఉన్నాడు. నాకు, తెలుసును- ఆయన వస్తాడని-అలా అవుతుందని. నాకు ఇష్టమే కాదూ-

నేను ఘసలడం కనిపెట్టి- ఆయన, ధైర్యం చాలక చట్టున లేచి నిల్చున్నాడు. ఎక్కడ మనసు మార్చుకుని-బెడిసి పోతాడోనని- నోరు మెదల్పకుండా- ఆ వంక చేతులుజాచి- బలవంతంగా పొదుపుకున్నాను- ఆయున్ని సుఖపెట్టడంలో- ఆయనకోసం-నేను లోకం- నన్నే నేను మరచిపోయినాను,

ద్వితీయం విఘ్నం కాలేదు-అలా అవుతుందేమోనని- ఆయనకుండవలసిన ఆదుర్దా అంతా నేను పడ్డాను. వారం రోజులు-వరుసగా-

పొరబాటు కాదు-తెలిసి చేసినపనే-నన్ను మోసగించలేదు-- ఆయన-మొగమాట పడకపోతే-నేనే బలవంతం చేసేదాన్ని-అవునమ్మా ఆ పరిస్థితి అలాంటిది. ఏం-నీకు కూడా, ఈ మాటంటే ఆశ్చర్యం వేస్తూన్నదా? కళ్ళు కానరాని కండకావరంతో-అప్పుడు పోతరించిపోయి-- ఇప్పుడు ఇంకో వేషం వేస్తూంది- ఇది ఎంతకైనా తగిందే తెగించి పోయిన . తరువాత- అని అనుకుంటున్నావా? - కాదమ్మా కథ సాంతం విను--

వారం రోజులు దాటిన తరువాత-అనుకున్నదానికన్న ముందరగానే,

అన్నయ్య తిరిగి వచ్చాడు. నేను మళ్ళా మా యింట్లో - - గృహప్రవేశమైనాను? అప్పటికి జానకి బాగా లేచి తిరుగుతూ, దానిపని అదే చేసుకునే ధోరణిలో పడ్డది.

నెల్లాళ్ళయింది - కొంచెం బెంగగా ఉంది :

రెండో నెల - అనుమానంగా - అవునా, కాదా అని - ఏలాగో మనసు కుదుటపరుచుకుంటూ తిరిగాను :

మూడో నెల - నిశ్చయమయింది : కొంప నిలువునా కూలి పోయిది. అన్నయ్యకు కూడా ఆమాకీ తెలిసింది :

ఏం చేస్తాడు. పాపం - నన్నా గద్దించి అడగలేడు - ఎవరితోనన్నా చెప్పడానికా - ఇంకా ఏమన్నా ఉందా - వాడలో ఉండనిస్తారా - తల ఎత్తుకు తిరగనిస్తారా - దాచడమా ఎంతకాలమనా ? ఎప్పుడో ఒకప్పుడు పాపం బద్దలుకాక తప్పుతుందా ?

అయిదో నెల జొరబడేదాకా - ఏంచేయాలో తోచక- కాలుకాలిన పిల్లిలాగా - నిలిచినచోట నిలువకుండా - నానా హైరానా పడ్డాడు. ఇక క్షణం తామసించడానికి వీలులేదు - అప్పటికే అమ్మలక్కలందరూఎలాగో పసికట్టి - గుసగుసలు పోతున్నారు : అవి ఏమన్నా చెవిని పడ్డవో ఏం కర్మమో - ఎన్నడూ పల్లెత్తుమాట అననివాడు - ఆనాడు ఇంటికి వచ్చి రావడంతోనే రుద్రుడైపోయినాడు - ఒకటని, ఒకటి అనలేదా ! అన్నిటికీ ఒడిపట్టి ఊరుకున్నాను.

ఊరుకున్నానన్న మాటేగాని - పైకి నాకూ తరతతర బుట్టింది. అంతవరకూ - ముంచుకు వస్తున్నా - మనసు - తుడిచిన పలకలాగా - ఏ ఊహ కనపడకుండా - అదోమాదిరి మైకంగా - ఏదో ఫలానా అని చెప్పలేని బాధగా - సంతోషంగా - ఉంటూ వచ్చింది. అన్నయ్యదూకుడు చూసిన

తరువాత ఒక్కమారి అయోమయంలో పడిపోయినాను - ఏది దారి ? - అంతటితో ఊరుకుంటాడా ? పెచ్చు మీరిపోయి - రెక్కపట్టుకు వాకిట్లోకి ఈడ్చివేస్తే - నేను ఏంకావాలి ?

అన్నుకున్నంతా అయింది-గెంటడం తరువాయి-కాని : మామరిది- ఆయన్ను మా అన్నయే సలహా అడిగాడట. ఏం చేయాలని - అవును గొర్రె కటికవాణ్ణే నమ్ముతుంది : - అడ్డుపడి, ఏదో హితబోధచేసి - అన్నయ్య మూర్ఖం నివడకపోవడంచేత - తానే ఖర్చులన్నీ భరించే పద్ధతి మీద - ఆ రాత్రికి రాత్రే - పట్నం బండికి పంపించాడు.

రైలు దిగగానే - నన్ను తీసుకువెళ్ళడానికి స్టేషనుకు వచ్చిన దొరసాని వెంట ఆస్పత్రికి వెళ్ళా, మా మరది - వాళ్ళకు, నేను బండి ఎక్కగానే టెలిగ్రాం ఇచ్చాడు.

మళ్ళా ఏడు నెల్లకు ... ఇవతల పడ్డాను... నా బంగారు తండ్రిని వాళ్ళు... ఏం చేసుకున్నారో... ఎవరికి పెంచుకోనిచ్చారో... భూమి మీద పడగానే... వాడికీ నాకూ ఈ జన్మకు రుణం తీరిపోయింది !

ఎల్లకాలం... వాళ్ళు మాత్రం ఉండనిస్తారా ? నాకు మళ్ళా మా ఊరు వెళ్ళాలంటే... మొగం చెల్లడంలేదు, ఎప్పుడ బయలుదేరుతావని అన్నయ్య ఉత్తరం వ్రాశాడు... నేను మెదలుకుండా ఊరుకున్నాను. అప్పుడు ఆయున స్వయంగా వచ్చి.... తీసుకువెళ్ళి యింట్లో దిగవిడిచాడు.

వదినె... నెల్లాళ్ళ క్రితమే పిల్లనెత్తుకుని వచ్చింది. అన్నయ్య వెళ్ళి బారసాల చేసుకుని - నెల వెళ్ళకముందే తీసుకువచ్చాడట. వచ్చానా - నాతో -, మావాడూ మాట్లాడలేదు - సరే, మా వదినెనన్ను చూడగానే మొగం పక్కకు లిప్పుకుని గదిలోకి వెళ్ళిపోయింది. చెప్పరానిదానికన్నా కనాకష్టం అయిపోయాను - తెల్లవారి లేవగానే కంటబడితినాయెనా, ఇద్దరి ముఖాలూ

మటమటలాడిపోయేవి. అయితే అన్నీ అమర్చిపెడితే - విస్తరి ముందుకు వచ్చి - ఎంచులు పెడుతూ - అన్నీ భోంచేయడానికి - అప్పుడు మాత్రం ఏ అడ్డంకులేదు ; అందుకు పనికి వస్తాను.

నా మీద దయదలచి ఉంచుకున్నారా ? చాకిరీకి మనిషి తేరగా అమిరింది గనక - ఎలాగో సరిపెట్టుకుంటున్నారు. మా వదినె - ఆరాణీ - అసలు మంచినాడే అంతంతాయెను - ఎన్నడూ అవతల చెంబు ఇవతల పెట్టిన పాపాన పోయిందా - అందులో, బాలింతరాలు ? అన్నయ్యకు ఆవిడ కాలు క్రిందపడితే ఎక్కడ అరిగిపోతుందోనని - ఎంత భయం ?

నేను - బాలింతరాలనే కదూ - కాని - ఆ ముద్దుముక్కలు చేసేది ఎవరు ? ఆ మాట తలపడానికైనా ఉందా ? ఒళ్ళు భారకించినా - ఎంత ఓపిక లేకపోయినా వేళకు-లేవకుండా, కొంచెం బద్ధకించి మూలిగానో, ఇక అవి దెప్పుళ్ళుకావు - సాధింపులుకావు - నా తల్లో గుండెచిట్టెం కట్టి పోయింది. ఎంతైనా తల ఒగ్గవలసిన దాన్నే కా ;

'నా కంట నరుడు పడరాదు. నరుడి కంట నేను పడరాదు' - ఇలా రెండు నెలలపైగా - రాణీవాసమైపోయింది. నా బ్రతుకు వెలువలప సావిడీ లోకైనా వచ్చే దాన్నికాను. అన్నాళ్ళూ గడప దిగుతే ఒట్టు !

ఇక, లోకం -

పాడులోకం - వేలువంచడానికి సందుదొరికితే ఊరుకుంటుందా ; గోరంతలు కొండతంతలు చేసి, దుయ్యపట్టుకోకమానుతుందా ? ఒక కంట్లో సున్నం - రెండో కంట్లో కారం -

అన్నయ్యకు - పరమయోగ్యుడికి ఇంత కష్టం వచ్చిందా ? అయ్యో పాపం - అని ఊరడించింది.

ఇంతకూ కారకురాలినికదా అని - ఈ కులనాపకురాలిని

పడదిట్టింది!

తిడుతున్నా ఆ నాలికే - మామరిది - మహానుభావుడు, ఆపత్తులో అడ్డపడ్డాడని - ఆయన్ను అందలాన పట్టింది : అయినా! అది ఎంతవరకు నిజమోలే - నోరు మాటాడుతూంటే నొసలు వెక్కిరిస్తూన్నప్పుడు - దేన్ని నమ్మడం ?

ఇలా - ఈ అగచాట్లమారి - బ్రతుకు - ఎప్పటికి తెల్లవారనూ అని నా గుండెల్లో రాయిపడింది. కాని, ఇంతలో ఏం జరిగిందనుకున్నావూ -

మా జానకి- నెలలు నిండాయి. సుఖంగాను చెంబెడు నీళ్ళూ పోసుకుని - తల్లి పిల్లాడూ గట్టెక్కి ఇవతల పడ్డారు. నక్షత్రదోషం ఏదో రవంత ఉందట, పోవడానికి నూనెలో మొగం చూసుకున్నారు. నేను రానన్నా, ససేమిరా కాదు కూడదని, పట్టు బలవంతాన పీక్కెళ్ళారు.

మా అమ్మడు పీటలమీద కూర్చుని ఉండగా, చూడముచ్చటైె ఒక్కమారు చెయి తీరికచేసుకొని, గుమ్మంలోకి తొంగిచూశా - ఎన్నాళ్ళయిందో దాన్ని చూసి -

అది నా వంక చూసేసరికి - ముఖం వెనక్కు లాక్కున్నాను. దాని కంట పడలేక పోయినాను.

ఆశీర్వచనాలైన తరువాత - పాపణ్ణి పొత్తికళ్ళలో పొదివి - నా దగ్గరికి తీసుకు వచ్చింది జానకి. నేను తలుపుకు చెయిబార జాచి, జారగిల బడి... కంట నీటి బొట్టు పొడమకండా, పళ్ళు బిగివిని నిలుచుని ఉన్నాను. నా వాలకం ఏం కనిపెట్టగలదు - పిచ్చపొడగట్టు - పిల్లవాణ్ణి నా చేతుల్లో పెట్టబోతూ - 'వెళ్ళు నాయనా - అమ్మ : - చూడవే - నిన్ను చూసి నవ్వుతున్నడేవ్ అక్కయ్యా : - ఇక నిన్ను వదలడేమోనేవ్ - తీసుకోవే - ఎనీలే నేను పనికిరాకపోతే - మీ అమ్మ దగ్గరికే వెళ్ళు బాబూ - ' అని తన

ఉబలాటం కొద్దీ - ఏమేమో పలుకుతూంది. నాకు - ఏలా ఉందని చెప్పనూ?

పక్కను చోద్యం చూస్తూన్న పెద్ద ముత్తైదవ ఒకావిడ - 'అవునే, జానకి - వీడిని మీ అక్కయ్యకు ఇచ్చేసి - నీవు ఇంకోకడుకును కనుక్కోవే - ' అని - ఆమెకు తోచినట్లు - హాస్యమాడింది. వింటూన్న వాళ్ళు, నవ్వారు : నా మనసులో భగభగమన్నది.... జాస్తున్న చేతులు వెనక్కు నెట్టుకుని... నీరోడుతున్నన కళ్ళతో వెనక్కు తిరిగాను : అందరి పాయసాల్లోనూ నెయ్యి ఒలికినప్పుడూ.. నా వంతుకు దక్కేది.. పచ్చి విషమేనా ?

కంట్లో నిప్పులు పెట్టుకుంది... చూసి ఓర్చే నేర్పుకూడానా..'' జానకి... మా జానకే... ఈ మాటలు.. నా వెనకాల అన్నది... అనవీ.. నిండా మునిగిన వాళ్ళ కేంచలి ?

అంతటితో ఆకాండ అయిపోయింది : అన్నం నోటికి పోలేదు : మెతుకు ముట్టకుండా.. ఊరికే విస్తరి ముందర కూర్చుని లేచాను. దాని కేంలే, కడుపునిండే ఉంది కాదూ, ఇవన్నీ చూసుకుంటూ :

ఓ విధంగానా, నాకు వంచన ? పులిమీద పుట్రరేగింది । రాత్రి భోజనాలైన తరువాత, ఒంటిపాటున... మా మరది నాకు, అడ్డంవచ్చాడు. మరి, అధమం ఏ మూడు నెలలైనా.. గదిలో పక్క వేయించుకునేందుకు వీలులేదుగా... ఎదురుగుండా నేను కబడుతూంటిని, ఊరుకోవలసినంత కర్మం ఏం వచ్చింది ? ఒకమారు లోకువైన తరువాత.. ఇక ... ఛీ... మగపురుగులు ।

ఎంత స్వాతంత్ర్యంతో నా చెయి పట్టుకున్నాడనుకున్నావు । ఊరకున్నాను । ఇంకా ముదరనీ..

రెండో చెయ్యి... నా భుజంమీద వేసి.. .మెడ మీదుగా వాల్చి నన్ను

దగ్గిరకు లాక్కునే... గృహస్థ మార్గంలో ... ఉన్నాడు.

జానకి... గుమ్మంలోకి వచ్చింది. మమ్మల్ని చూసి... గుడ్లు వెళ్ళకొచ్చి.. తూలుతూ వెనక అంగవేసి... తలుపు రపీమనిపించి, లోపలపడి కెవ్వుమన్నది.

- మా ప్రబుద్ధుడు, తన ధోరణిలో తానున్నాడు కాని... వెనకా ముందూ చూడటం వుందా ? రానిచ్చాను... వెందలకుండా... అసహ్యించుకుని ముఖం తిప్పేసుకోకుండా.. మరీ దగ్గరకు రానిచ్చాను మా యిద్దరి పిడికిలి ఇనుపగుండు లాగాచేసి, ఎగువకు, గురిగా పళ్ళు కరుచుక పోయేటట్టు, గడ్డం చెక్కలయేటట్టు.. విరగబోడిచాను. తగిలీ తగలడంతోనే, మళ్ళా కిక్కురుమనకుం, చాపచుట్టగా పడిపోయినాడు... మా మరిది... అంత సత్తువ ఎక్కడి నుంచి వచ్చిందో నాకు !

వెనక్కు తిరిగి చూడకుండా.. దూసుకువచ్చి... చూడకుండా రావడంలో... పారిజాత చెట్టు మీదపడి, లేచి.... ఏలాపోయి పడ్డానో, మా యింటిదగ్గర పిలవగా, పిలవగా ఓ పట్టుకు, మా వదినె - పమిటె సర్దుకంటూ - వచ్చి తలుపుతీసి - నిలవకుండాపోయి, గది తలుప గడియ వేసుకున్నది - నాకు, ఊరిన పుండుమీద ఉప్పూకారం చల్లినట్టయింది - అందరికీ నేను భారమే !

అప్పటికి ఈ ఆలోచనలేదు సుమా. మతిచెడి... మనస్సంతా పాడపోయి క్షోభపడుతూ... సావడి నాలుగు మూలలా కలయ దిరుగుతుండగా.. వంకెన, బరువుగా... అన్నయ్య కోటు... జేబు కనిపించింది. చూడగానే... అప్పుడూ, ఈ ఆలోచన తోచింది... చూస్తూన్నకొద్దీ అదిపాతుకు పోయింది. ఒక్క క్షణం ఇక ఆలస్యం చేయకుండా, పర్సుమెల్లిగా తీసి... కాలవలసినంతా అందులో ఉందోలేదో

చూసుకుని, చేతబట్టుకున... పిల్లిలాగా అడుగులో అడుగు వేసుకుంటూ, ఆ యింటికీ.. యింటి వాళ్ళకూ... అంతటితో ఋణం తీర్చుకుని... వచ్చేశాను.

ఎవరికంటా పడకుండా.. రైల్లోపడి... రెండుసార్లు ఎక్కడ మారాలో తెలియక, దోవతప్పి... వెనుకాముందూ... అయి... చివరకు... ఇవాళ అసుర సంధ్యలో.. ఇక్కడదిగాను.

దిగి యికాయికిని వచ్చేశానమ్మా ! నాలిక పిడచ బారిపోతూంది ! మా గంగమ్మ తల్లిని చూడందీ... పచ్చినీళ్ళన్నా ముట్టకూడదనుకుని.. తీర్థోపవాస ఫలం దోవలోనే దక్కించుకు వచ్చాను.

చిరుకెరటాల మీద... అనుమానాలన్నీ ఒడ్డున పరిగెత్తిస్తున్నావా నాకు మాత్రం తెలియదనుకున్నావమ్మా ! చెప్పనా ?

నా మరిదిని ఎందుకు లోబరచుకున్నానా ? నా కోసం కాదు ... నా చెల్లెలికోసం. వెలిరంచులు మరిగి, ఇక దానిక దక్కకుండా పోతాడేమోనని... దాని జీవితం ధ్వంసం కాకుండా, నన్ను బలియిచ్చుకున్నాను నాకే కోరిక ఉండి, చెడి పోవాలనుకుంటే... ఆ ముసలితాతేనా.. దొరికింది దేశం గొడ్డుపోయిందా ? తనను వలచి వచ్చాననుకున్నాడు... యిష్టం వచ్చినప్పుడల్లా.. లోకువ చేసుకోగల... ప్రజ్ఞ ఉందనుకున్నాడు... పాపం... పిచ్చిబ్రాహ్మడు : ఆజన్మ అంతేలే ! బుద్ధి వచ్చిందంటావా, ఏమో నాకు నమ్మకంలేదు. బుద్ధే ఉంటే. నీతి నియమం అనేదే ఏ మూలైన ఉంటే చేసిన పాడుపని ఆసరాతో ప్రతిష్ఠ సంపాదించుకునేందుకు పెనగులాడుతాడా ? - కన్ను తెరవని పసికూననను కటికి వాళ్ళకు అప్పగించనిస్తాడా ?

జానికి... నేను విరగడైపోయిందే చాలునని... సంతోషిస్తుంది పోనీలే,

నామీద జాలితలవడం... నా కోసం బాధపడడం కన్న... ఇదే మంచిది : నా మీద కోపం అల్లా దానికి మొగుడుమీద ప్రేమను పుట్టిస్తుంది. ప్రాణిపళ్ళు అందుబాటులో లేకపోయినకొద్దీ... మెడ మరీ సాగుతుంది. ఇంకొకరికి దక్కి పోతున్నాడని తెలిసినప్పుడు కాని, ఆడదానికి... మగవాన్ని తానే సర్వాపోశనం పట్టాలనే తహతహ పుట్టదు ; అలా జరిగిందో.. అంతకన్నా నాకు మరి కావలసినదేముందీ ?

కన్న తరువాత.. నెలలు మోసినందుకు ఫలం దక్కకుండా చేజారి పోయిన తరువాత కాని... కడుపు తీపంటే ఏమిటో తెలియలేదమ్మా. పోనీలే... ఒంటరిగా నూయున్నై పోవడంక్న, తీరని కోరికలన్నా,నెంట తీసుకువస్తున్నాను ! అదీ కొంత మేలే కాదూ ?

ఎవరిమీద పగ సాధించను.... ఎన్నింటికని ఏడ్వను... నాకు లేకపోయినా... ఇంకోరన్నా... నా మూలాన కుదటపడి బాగుండడమే పదివేలు !

అన్నయ్య అంటావా - 'పోయి గంగలో కలవనీ - దానికిలాటి విపరీతపుబుద్ధి పుట్టినప్పుడే అది మాకు కానిదైపోయింది'... అని మొండిగా అనేస్తాడు : ఒకవేళ... అనలేక ఊరుకున్నా, నేర్పెనెరజాలు, మా వదినె ఉండనే ఉన్నదిగా !

నేను ఎవడి వెంటనోపడి దేశాలుపట్టి పోయినాను అనుకుంటారు.. అంతేకాని... వాళ్ళ నోటివాక్యమే ఫలిస్తూన్నదని... ఏలా అనుకోగలరు ?

ఇక..... వాళ్ళెవరికి నేను కలలోనైనా కనపడను కాదూ -

'నీది ఇంత దొడ్డమనసా' అని ఆశ్చర్యపడుతున్నావా ? నీ వొక్కతెవేనా, మరి, ఈ ఏడేడు పధ్నాలుగు లోకాల్లోనూ ?

మీ చెల్లెలు పార్వతి కోసం.. మహేశ్వరుడితోటి నీవు ఆడిన నాటకమే

- నేనూ వర్ణించానమ్మా! నిన్ను చూసి నేర్చుకున్నదేనమ్మా.

మన ఇద్దరి మనసూ ఒకటి. మనకోరికలు ఒకటి. మన ఇద్దరి పేరుకూడా ఒకటే.... అందుకనే.... నిన్ను వెదుక్కుంటూ వచ్చానమ్మా.

కళ

మానవునికి సౌందర్య సంవీక్షణ మువలన కలుగు ఆనందము ప్రకృతి సిద్ధమైనది. నిండు పున్నమనాడు పడమటి కాంత యొడిలోన పవళించియుండు నెలబాలుని తిలకించినప్పుడు కాని, ఆకులు రాలక పూలువాడని ఆరామమందు ''చిలకపోటులచేత జెరగిన సహకార ఫలముల'' నుండి స్రవియించు పచ్చి తేనెను పరికించినప్పుడు కాని, మరియెట్టి మనోహర దృశ్యమును గాంచినప్పుడు కాని, మన హృదయములందు సౌందర్య సాక్షాత్కార మగుచుండును. విద్యాధికులకు విజ్ఞానులకు, విద్యావిహీనులకు, అజ్ఞానులకు, శ్రీమంతులకు, నిరుపేదలకు స్త్రీలకు పురుషులకు బాలురకు అందరికిని కొలదియో, గొప్పయో సౌందర్యరక్తి యుండితీరును, మానవునకు సౌందర్యమునందున్న సహజమగు ప్రేమయే అతడు లలితకళల నారాధించుటకు ప్రోత్సాహ కారణ మని చెప్పవచ్చును. మానవుని హృదయమున యొచ్చటనో దాగియున్న సృష్టిశక్తి పైకుబికివచ్చి ఏదో యొకరూపముదాల్చుటయే లలితకళ ఆవిర్భావమని చెప్పవచ్చును. లలితకళలు సౌందర్యపు భావచిత్రములు కావున కళ స్వభావమును గుర్తించినపుడే మనము సౌందర్య దర్శనము చేయగలుగుదుము.

ప్రపంచము నందలి ఏ గొప్పకళనైన తిలకించుడు ; అది ఒక ప్రత్యేక వ్యక్తి నిర్మాణ మని విశదమగును. అట్లగుటచే ఒక కావ్యముగాని ఒక చిత్రము

కాని ఒక భంగిమకాని సరిగా పూర్వ సంప్రదాయమును అనుసరించి, ఇదివరకున్న వాని వలెనే యుండి, ఒకే యంత్రము నుండి తయారుచేసిన నాణెములవలె నుండుట సంభవముకాదు... ఒక క్రొత్త జీవకళ, ఒక క్రొత్త చైతన్యము కలిగినదే నిక్కమగు కళయని చెప్పవలసి యుండును. పాతపాటలే తిరిగి పాడిన రోతగా నుండదా! ఉద్రేకము కవిత్వమునకు కాదు - సౌందర్య ప్రధానములగు కళలన్నింటికిని జన్మస్థానమనే చెప్పవచ్చును. కవివలె చిత్రకారుడు కూడా భావనా వీధులందలి తన యనుభవములను వర్ణముల రూపమున ప్రదర్శించుచుండును.

లలితకళ లక్షణములను వివరించుచు సిద్ధాంతములను ప్రతిపాదించు గ్రంథము లనేకము కలవు. కాని ఈ సిద్ధాంతములను మాత్రమే నమిలి మ్రింగుటవలన ఎవరికిని నవనవోన్మేష శాలినియగు ప్రజ్ఞ లభింపజాలదు. సహజ ప్రతిభ పరిపూర్ణముగా అభివృద్ధి నొందుటకు దోహదము మాత్రమే కావించునవి లక్షణ గ్రంథములు-సంప్రదాయము, కళను సమకాలిక సాంఘిక పరిస్థితులతో సమన్వయించి ఆ రెండింటికి సమరస భావము కలిగించునది మాత్రమే! ఒక కాలమున అత్యుత్తమముగా పరిగణింపబడిన సంప్రదాయము మరియొక కాలమున పనికిరాకపోవచ్చును. కావుననే కాలముతోపాటు సంప్రదాయములు అమరి జాతీయ పునర్వికాసము జరుగుచుండును. కళాసౌందర్యమును ప్రతిపాదించు యేయొక్క సిద్ధాంతమునుగాని మనము ఆ విషయమున తుది మాటగా అంగీకరించుట పొసగదు. సర్వకాల సర్వావస్థలయందు కళా సౌందర్యమును ప్రతిపాదించు ఆదర్శమిది యొక్కటేయని యెవ్వరును వ్రేలెత్తి చూపజాలరు. అట్లయినచో అభివృద్ధియను మాటయే మన శబ్దకోశమునుండి అంతరించవలసి యుండును. ఒక కాలమునందు ఒక గొప్ప కళోపాసకుడు

నిర్మించినకళాశకలమును అచ్చుగ్రుద్దినట్లు మరల మనము తయారు చేయజాలము. అట్లుచేయుట కళకాదు ; చేసినను అది యొక నమూనా మాత్రమే యగును. అందు కళా సౌందర్యము లోపించితీరును. ప్రత్యేక వ్యక్తిత్వము వైలక్షణ్యము కలిగిన నిర్మాణమే కళోపాసకుల ఆదర్శము. బింబములను ప్రతిబింబములను తయారు చేయుట కళోపాసకుల పనికాదు.

కవిత్వము లలితకళలలో ప్రధాన స్థానము నాక్రమించును - కవిత్వమునకువలె ఇతర లలితకళలకును కారణభూతములగు విషయములు రెండు - మొదటది భావచిత్రము, రెండవది భావచిత్రములను హృదయ ఫలకములందు ప్రదర్శించు మనోవికారము. కావ్య ప్రపంచమున, వ్యక్తుల భావచిత్రములు, వివిధ వస్తువుల దృశ్యముల భావచిత్రములు. మానవుని సుఖదుఃఖముల భావచిత్రములు, మున్నగునవి ప్రదర్శితములగుచున్నవి. ఈ భావ చిత్రముల వెనుక కవి యొక్క నివే కాదు. పాఠకుల మనోవికారములు కూడా గోచరించు చుండును. దుస్సహ దుఃఖానుభవములు, కంటికి నీరుదెచ్చి హృదయమును కరగించు కరుణ రస ప్రపూర్ణములగు ఘట్టములు, పరమాత్మతో లీనమగుటకు అంతరాత్మ పడు ఆవేదన మున్నగు మనోవికారములతోపాటు ''దాటిపోయిన యుగముల'' నాటి చరిత్ర యొక్క భావచిత్రములను లలితకళలు మనయెదుట ప్రదర్శించుచున్నవి. కార్యకారణ క్రమమున వివరింపరాని అనిర్వచనీయ మాధుర్యము సౌందర్యానుభూతి కవిత్వము మన కొసగుచున్నది. భావచిత్రములను, మనోవికారములను కళా ప్రపంచమున వేరుపరచుటకు వీలులేదు. ఈ రెండు శక్తుల సరస సమ్మేళనమే కళా సౌందర్యము ఈ రెండు శక్తులుగాక కళా ప్రపంచమున అనేక యితర విషయములు కూడా సౌందర్య దర్శనమునకు

సహకారాలు కావచ్చును. ఈ సందర్భమున కళా వస్తువు చారిత్రకముగా గాని ఇతరత్రముగా గాని యథార్థము కావలసిన యవసరములేదని మనవి చేయుట ఆవశ్యకము.

ఒక ఛాయా చిత్రమును పరికించుడు - అది ప్రపంచమునందలి యొక మానవుని యొక్కగాని వస్తువుయొక్క గాని ప్రతిబింబము. ఈ ప్రతిబింబము కళాశకలము గాజాలదు. కేవలము వివిధవర్ణముల విచిత్ర సమ్మేళనము కళ కాజాలదు. అట్లే వివిధ ధ్వనుల సమ్మేళనము కూడా సంగీతము కాజాలదు. అదియే సంగీతమైనచో గాయకుడు కానివాడు కూడ సంగీతమును రచింపవచ్చును. తుట్టతుదకు వివిధ ధ్వనులను సాధ్యమైనన్ని విధములుగా సమ్మేళనము చేసిన తరువాత సంగీతము, కవిత్వము ఈ ప్రపంచం నుండి శాశ్వతముగా నిష్క్రమించవలసి వచ్చును. కావున బాహ్యస్వరూపమునుగాంచి, శబ్దవర్ణ ధ్వనుల సమ్మేళనముగాంచి ; అదియే నిక్కమగు కళయని భ్రమించుట ప్రమాదము. కళా సౌందర్యమును ప్రతిపాదించు భావచిత్రములు, మనో వికారములు లేనిది అది కళ యెన్నటికిని కాజాలదు. కవితా రసపిపాసువగు పాఠకుడొక గ్రంథమును పఠించునపుడు శబ్దజాలముయొక్క ఇంద్రజాలముతో సంతృప్తిపడక అందలి కావ్యసౌందర్యము తనివితీర యనుభవించును. మేధాసంపద, యుక్తివాదము, వివిధ విషయ పరిజ్ఞానము ప్రపంచమునకు పరమోపకార మొనరించుట నిస్సంశయమే. కానిరస పిపాసువునకు సౌందర్య సాక్షాత్కారము కలిగించుశక్తి మాత్రము వానికి లేదు''. హృదయశక్తిలేని మేధాశక్తి, సౌందర్యములేని విజ్ఞానము, భార్యలేని భర్త సంసారము వంటివి. ఈ సత్యమును కళా సౌందర్యమును తృణీకరించు శుష్క హృదయములు గ్రహింపవలెను.

కళ తత్వశాస్త్రము కాదు ; కళ చరిత్రకాదు ; కళ భౌతిక శాస్త్రము

కాదు. గాలిలో మేడలు కట్టుట కళగాదు. భౌతికశాస్త్ర తత్వశాస్త్రములవలె యుక్తివాదముపై ఆధారపడకున్నను, చరిత్రవలె గత కాలములో జరిగిన సంగతులు గ్రహించునది కాకపోయినను, కళయందు కూడ ఒక ప్రత్యేకమగు క్రమము, విలక్షణమగు సత్యము గోచరించుచుండును. అస్పష్టమై, క్రమబద్ధముగాక చెల్లాచెదరై యున్న మనోవికారములకు విశిష్టము క్రమబద్ధమునగు స్వరూపము నొసంగుటయే కళ ప్రత్యేకత ; ఆకాశ హర్మ్యములను నిర్మించునది గాక ప్రతిభావంతమగు సృష్టిని గావించునది కళయని మనము గ్రహింపవలెను.

మన యందరికిని మనోవికారములు కలుగుచుండును. మనము సంతోషించెదము ; దుఃఖించెదము ; కోపించెదము ; దయార్ద్రహృదయుల మగుదుము. ఆ సందర్భములందు అప్రయత్నముగా మననోటినుండి శబ్దజాలము ఉబికి వచ్చును. కాని, యీ మాటలు కవిత్వము కాజాలవు. కవియగువాడు తన మనోవికారములను ఏకముఖము గావించి క్రమబద్ధముగా వ్యక్తీకరించునప్పుడే అది కవిత్వమగును ; అందు సౌందర్యము ప్రతిఫలించును. కాని నోటికివచ్చిన మాటలన్నియు కవిత్వము కాజాలవు. ప్రతిభాశాలియగు వ్యక్తిచే ప్రశాంత సమయమున సంస్మరణమునొంది వ్యక్తమైన భావములే కళా సౌందర్యమునకు ఆటపట్టులని యొక విమర్శకుని అభిప్రాయము కావుననే మన హృదయములందు కలుగు మనోవికారములు తాత్కాలికములే. కవిత్వము నందలి మనోవికారములు విశ్వజనీనములై యొప్పుచుండును. అనేకులు పుత్రశోకము ననుభవించుచున్నారు. ఆ సందర్భములందు మనోవికారము లెన్నియో రీతుల ప్రదర్శించుచున్నారు. ఈ ప్రదర్శనములు, ఈ ప్రలాపములు తాత్కాలికములు మాత్రమే. కాని కళయందలి శోకమట్టిదికాదు ; దానికొక శాశ్వతతత్వము కలదు. దీనినే కళకు

సంబంధించిన విశ్వజనీనతయని చెప్పవచ్చును. కావుననే కవి వ్యక్తీకరించిన శోకము, సంతోషము, కరుణ, వేడుక, వేదనలు ప్రత్యేక వ్యక్తిత్వము కలిగి విశ్వజనీనములై యొప్పుచున్నవి. ఒకేయొక భావమును ప్రదర్శించుకళ కొంత వెగటుకలిగించవచ్చును. వైవిధ్యము కళ అందమును ద్విగుణీకృత మొనరించును. కావుననే కాబోలు మన వారు కావ్యమునందు అష్టా దశవర్ణనాదు లుండవలెనని విధించు కావ్య వస్తువు విశాలపరచినారు.

కళ ముఖ్య కర్తవ్యము ఉపదేశము. ప్రచారము అనుశాసనములు కావు. ఉపదేశము, ప్రచారము, అనుశాసనము అంతర్వాహినులుగా నుండవచ్చును. కవిత్వమును కాంతా సమ్మితముగా గ్రహించిన మన ప్రాచీనులు యీ సత్యమును చక్కగా విశదీకరించినారు. మానవ జీవిత విమర్శనమే కళకు ముఖ్య ప్రతిపాదకమగు విషయము.

కళా సౌందర్యమునకు కేంద్రస్థాన మేదియను ప్రశ్న స్వాభావికముగా కలుగుచున్నది. ఒక చక్కని అజంతా చిత్తరువును తిలకింపుడు. ఆ చిత్రము ఒక్కొక్క మానవునియందు సంస్కృతి ననుసరించి ఒక్కొక్క విధముగా సౌందర్యానుభూతి కలిగించును. కొందరిని రవివర్మ పటములే యెక్కువగా ఆకర్షించుట జూచుచున్నాము. కావున కళాసౌందర్యమునకు ఆటపట్టులు మనహృదయములే యని చెప్పుట మిక్కిలి సమంజసము.

పటమునందలి వర్ణములు, రేఖలు మున్నగు సాధన సామగ్రి మాత్రమే కళాసౌందర్యమున కాటపట్టులు గావు. అర్థశాస్త్ర ప్రపంచమున ఇవి యుపయోగకరములగు వస్తువులు ఇవి కావు - అని స్పష్టముగ నిర్దేశించలేని విధముగనే కళా ప్రపంచమున గూడ ''ఇవి సుందరమగు వస్తువులని'' మన మొక కడపటి నిర్ణయము చేయజాలము. అర్థశాస్త్రమున అవసరము,

సరఫరా మున్నగు విషయాలు వస్తువుల యుపయోగమును నిర్ణయించిన విధముగనే రసికుల మనోవృత్తి కళా ప్రపంచమున సౌందర్య నిర్ణయము గావించుచుండును.

మనము కావ్యములను శృంగార కావ్యములు, వీర కావ్యములు అని వివిధములుగా విభజించుచున్నాము. ఇది మన సౌలభ్యమునకై చేసికొనిన విభజనమే కాని కావ్య సౌందర్యమును కొలిచి చూపు మానదండము కాదు. శాస్త్ర ప్రకారముగా ఒక కావ్యము సర్వలక్షణ సమన్వితమై యుండవచ్చును ; కాని సౌందర్యము సంపూర్ణముగా లోపించవచ్చును. వ్యాకరణము, అలంకార శాస్త్రము, సాహిత్య శాస్త్రము, మున్నగునవి రచనా సూత్రములను బోధించి భాషా సంప్రదాయములను తెలుపుటకు సహకారము చేయునుగాని కళ అంతరాత్మను చూపించజాలవు. కళా సౌందర్యమునకు పరమ ప్రమాణము రసికుల హృదయములు మాత్రమే.

- దేవులపల్లి రామానుజరావు

ఆంధ్రుల సాంఘికాచారములు

భారతదేశంలో భావైక్యతను క్రొత్తగా నెలకొల్పి, తద్వారా జాతీయ భావమును పెంపొందించ వలెనని తలచువారు నేడు పెక్కువుంది కాన్పింతురు. ఇటువంటి భావైక్యత శతాబ్దంనాటి నుండీ దేశంలో వ్యాపించి ఉందని వీరు గుర్తించాలి. దాని అంతర్యం ఏమిటో, అది దేని మీది ఆధారపడి ఉందో అది కూడా చక్కగా పరిశీలించి తెలుసుకోవాలి. సాధ్యమైనంతవరకూ దానికి దోహదంచేస్తూ వెళ్ళడమే విజ్ఞత అవుతుంది. కొందరు దీనికి విరుద్ధంగా ఆలోచిస్తారు. దేశంలో ఇదివరకుండిన భావైక్యత నామమాత్రమైనది. ఇంతేకాక అది వర్గపీడనము మీద ఆధారపడి నిల్చిఉంది. అందుచేత దానిని విచ్ఛిన్నముచేసి, శాస్త్రీయము, ఇతోధిక మానవతాభావపూర్ణము అయిన వ్యవస్థను ప్రచురితం చెయ్యాలంటారు. హేతువాదమునకు ఈ యాలోచనాపరంపర నిలువ గలిగి ఉన్నను అది యెంతవరకు ఆచరణ సాధ్యమో కాలమే నిర్ణయించాలి.

భారతజాతీయైక్యతకు మూలములన్ని రాష్ట్రములందును ఒకే విధమైన సాంఘిక వ్యవస్థ, ఆచార వ్యవహారములు వాడుకలో నుండుటయని చెప్పవచ్చును. ప్రస్తుతము ఆంధ్రదేశము నందలి ఆచార వ్యవహారములను పరిశీలిద్దాము. పాశ్చాత్య సభ్యతపై ఆధారపడి నూతన భావములు దేశమునందు ఇప్పుడు వ్యాపిస్తున్నాయి. ఒక తరానికి ముందు పూర్వపు సాంఘిక వ్యవస్థ తాలూకు ఛాయలు దేశంలో బాగా కనపడేవి.

సాంఘికాచారాల్ని యథాతథంగా తెలుసుకోవాలంటే సంఘంలో కనబడే వివిధ వర్గాలను గుర్తుంచుకోవాలి. ప్రధానంగా బ్రాహ్మణులు మున్నగు అగ్రవర్ణములవారు, మిగిలిన అగ్రవర్ణములవారు అనే విభాగం గమనించాలి. ఈ విభాగం మనకు ఇష్టమూ, అనిష్టమూ అనే ప్రశ్న ప్రకృతము అనవసరము. స్థితిస్యగతిశ్చింతనీయా అన్నట్లు ఉన్నదానిని గ్రహించాలి. వర్ణములవలెనే పురుషులు స్త్రీలు అనే వర్గాల్ని గుర్తించాలి. ఆర్య - ద్రావిడ సంస్కృతీ భేదములను గూడ మనము జ్ఞాపకం ఉంచుకోవాలి. మరొక పేరుతో వీటిని పిలవాలంటే ఆర్యాచారములు దేశీయాచారములు అని పిలవవచ్చును.

సాంఘికాచారములని చెప్పబడేవానినే పూర్వులు షోడశకర్మలు లేక సంస్కారములు అనేవారు. వానిలో ముఖ్యమైనవి జాతకర్మ, నామకరణము అన్న ప్రాశనము, చౌలము, ఉపనయనము, వివాహము, గర్భాధానము, అంత్యక్రియలు. వీటిలో కూడా ఉపనయనము, ద్విజులకు మాత్రమే వర్తిస్తుంది. స్త్రీలకు ద్విజేతరులకు ఈ బాధ్యత లేదు. స్త్రీల విషయంలో పుంసవనము, సీమంతము అను విశేషాచారములు కనిపిస్తున్నాయి. గర్భ చిహ్నములు కనబడగానే పురుష శిశువు కలుగవలెనని చేసే సంస్కారము, సీమంతము లేక సీమంతోన్నయనము అని చెప్పుదురు. ఇప్పుడే గాజులు పెట్టించుట జరుగును. కొన్ని కుటుంబములందిది ముత్తైదువులకు పసుపు కుంకుమ తాంబూలము మున్నగునవి ఇచ్చుటతోనే ముగియును. గాజులు పెట్టించుట ఉండదు. మన సంఘమునందు ఆర్య ద్రావిడ జాతి జనుల కలయిక జరిగినదనుటలో విప్రతిపత్తి లేదు. కావున వారియాచారములును సమ్మేళనము చెంది ఒక నూతన సమన్వయ మేర్పడినది. మన సాంఘికాచారములన్నిటిలోను ఆర్యుల సంప్రదాయములు కొంతవరకూ సంస్కృతిచే ప్రసన్నములై ఉంటాయి. దేశీయాచారములందు మూఢ

విశ్వాసముల పాలు అధికంగా కనబడుతుంది. ప్రసూతికా గృహములో చేయవలసిన సంస్థను గూర్చి తెలుగుకావ్యములలో ఎన్నో వివరాలు లభిస్తాయి. ఇందులో కొన్ని ఆరోగ్య సూత్రముల మేరకు పరంపరగా వచ్చేవి, కొన్ని ఆచారములు భూత ప్రేతాదులను పురిటి యింటి నుండి దూరముగా నుంచుటకై అనుష్ఠింపబడేవి.

వివాహమునందు ఆర్యాచారములు దేశీయ పద్ధతులు కలగలుపుగా కనబడతాయి. పాణిగ్రహణము, సప్తపది, సన్నెకల్లు త్రొక్కుట మున్నగునవి ఆచారములు. కావుననే వీటికి వైదిక మంత్రాలు ఉన్నాయి. మంగళసూత్రధారణము దేశీయాచారముగానే భాసిస్తూంది. దీనిని మంత్రములతో గాక శ్లోకములతో నడుపుతున్నారు. తాళికట్టుట అను సంస్కారము జనులలో బహుళవ్యాప్తి నందినట్లు కనిపిస్తూంది. క్రైస్తవ కటుంబములు కూడా కొన్ని కొన్ని వధువునకు మంగళసూత్రధారణం చేయిస్తున్నాయి. వివాహము నందు పెక్కువేడుకలు దేశీయాచారములుగ వాడుకలో నున్నవి. బాల దంపతులకు అన్యోన్య ప్రేమ కలిగించడానికి ఎన్నో ఏర్పాట్లు ఉండేవి. బంతులాడుట (పూలచెండ్లు) తలుపుల దగ్గర పేర్లు చెప్పించుట, ఒకే కంచంలో అన్నముతినిపించుట, దండాడింపు మున్నగునవి. దండాడింపు అనునది వేడుక నృత్యము. పసివారైన వధూవరులను పెద్దవారు ఎత్తుకొని బుక్కాచల్లుచు నృత్యమాడుదురు. పెండ్లిలో దొంగవేలము అను వొక ముచ్చట కలదు. పెండ్లి కూతురు బావగారు (అక్కమగడు) మరదలిని దాచిపెట్టును. అప్పుడు పెళ్ళికొడుకు వంకవారం పెండ్లికువమార్తె బావకు కట్నమిచ్చి నవ వధువును విడిపించుకొందురు. మరియొక అందమైన వేడుక ఐరేనికుండలకు సంబంధించినది. అయిరేని కుండలు మనోజ్ఞముగా రంగులు పూసిన

పెండ్లికుండలు. బ్రాహ్మణేతరులు వివాహ తంత్రము నందు వీటి కెక్కువ ప్రాధాన్యం ఇస్తూన్నట్లు కనబడుతుంది. ముత్తైదువలు ఈ కుండలు పట్టుకు వస్తారు. వీని ప్రయోజన మేమిటంటే - కుండనీళ్ళలో బంగారము వెండి వస్తువులు, ఉంగరము, మట్టెవంటివి వేసి నూతనవధూవరులచే తీయిస్తారు. వాటిని వెతకడంలో ఔత్సుక్యము కలిగి ఆలేత దంపతులు ఆనందం పొందుతారు. బంగారపు వస్తువు పట్టుకొన్న వారు గెలిచినట్లు. ఈ యాచారము బ్రాహ్మణులందును కలదు. నాకబలినాడిది చేయించుచుండిరి. కుండలకు బదులు బిందెలు వాడుదురు. రంగు పూత గలిగిన చిన్నకుండలను వివాహమునందు నాకబలినాడు బ్రాహ్మణ కుటుంబములవారును అలంకరించుచుండిరి.

తలంబ్రాలు పోసుకొనుట మిక్కిలి ప్రాచీన కాలమునుండియు వచ్చుచున్న ఆచారంగానే కనబడుతూంది. ''ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతామ్ శ్రీరామ వైవాహికాః'' అని చెప్పుదురు. అక్షతలకు బదులు జొన్నలు వాడుట కొన్ని కులములలో నున్నది. అరుంధతీ దర్శనము చేయుట ప్రాచీనాచారముగనే ఉన్నది. అత్యంత ప్రాచీన కాలముననే ఆర్యులు జ్యోతిర్మండలమును బాగుగా పరిశీలించిరనుటకు ఇది యొక తార్కాణము. మగపెళ్ళి వారు వివాహమునకై తరలి వచ్చినప్పుడు పెళ్ళివారు వారిని సన్నాహముతో ఎదురుకొని ఆదరించి పెండ్లికి తీసుక వెళ్ళుదురు. ఇవియే ఎదురుకోళ్ళు. వివాహములో చిట్టచివరి అంగము అప్పగింతలు. పెండ్లి కుమార్తెను అత్తవారి వంకవారికి పేరుపేర అప్పగించి నూతన వస్త్రములు బహూకరింతురు. ఈ సమయమునందు కన్నీరు పెట్టని గృహస్థుడుండడు. ''వైక్లబ్యమ్ మమతావదీదృశ మహో స్నేహా దరణ్యౌకసః। పీడ్యంతే గృహిణః కథమ్ను తనయా విశ్లేషదుఃఖైర్నవైః'' అని కణ్వ మహాముని చెప్పినమాట

అక్షరాల నిజముగదా, ఇనికాక బూజనుబంతి వంటి వేడుకులు పెళ్ళిళ్ళలో ఎన్నో నడుస్తూ ఉంటాయి. నైషధంలో దీనిని వర్ణించారంటే చాల కాలంనాడే ఏర్పడిన వేడుక అన్నమాట. వివాహంలో అంతా సంతోషమే గనుక ఎప్పుడో గృహస్థులయిన వారుకూడ నూతన కౌతుకముకు లోనయి భోజనముల వేళ పిండి వంటలతో మొత్తులాడుదురు. పెండ్లిపాటలు వాటి హాస్య కరుణ సన్నివేశములు అదొక వెన్నెలజల్లు. ఈనాటి దుర్భర వ్యాపార నాగరికతయందు ఈ మహా సంరంభమంతయు తియ్యనికలగా మారిపోయినది.

పురుషులు నాడును నేడును బయటి జీవితమున కలవడిన వారే కనుక గృహ వాతావరణమునందు వారంతగా శోభించరు. అందుచేత సాంఘికాచారములన్నీ చాల వరకు స్త్రీలకు సంబంధించినవిగా ఉంటాయి. పసుపు, కుంకుమ, పరిమళములు, రంగులు, అలంకరణములు, నగలు అన్నీ వారిసొమ్ములు. శిశువు జన్మించిన పదనొకండవనాడు బాలసారె అను ఆచారము నడుపుదురు. జన్మ నక్షత్రము శుభా శుభములను బట్టి నూనెలో నీడ చూచుట మున్నగు ఆచారములు లాంఛనముగానైనా ఇప్పటికీ ఉన్నాయి. పదకొండవ దినమునగాని 21 వ దినమునగాని శిశువును తొట్టెలో వైతురు. ఈనాటి నుండియే శిశువు తల్లి చిన్న చిన్న యింటి పనులలో ప్రవేశించును. దీనికి గుర్తుగా కాబోలు స్త్రీలందరు బావి కడకు వెళ్ళి బాలెంతరాలిచే నూతిలో చేదవేయింతురు. ఇక్కడ ఒక మనోహరమైన ఆచారము వినవస్తుంది. జన్మించిన శిశువుయొక్క బొడ్డును తీసియుంతురట. అంతవరకును పిల్లలు పుట్టక మక్కువపడుచున్న కొమ్మలచే ఆ బొడ్డుతునుకలు తినిపించుటయో వాసన చూపించుటయో చేయుదురు. దీనిచే వారికిని సంతానము కలుగునని నమ్మెదురు. 'మీరు తినండంటే మీరు తినండనీ, మాకొద్దంటే మాకొద్దనీ' పూబోండ్లందరూ

పరాచికాలాడుకొనుట విరబూచిన మల్లెపందరిలా ఉంటుంది. మగపిల్లలకు పుట్టువెంట్రుకలు తీయింతురు. ఇదియే చౌలము కావచ్చును. ఆడపిల్లలకు కొన్ని ప్రాంతములలో నీలాలు తీయుదురు. దేవుళ్ళకు మీదుకట్టి తిరుపతి, అన్నవరం మొదలైన పుణ్యస్థలాల్లో జుట్టు తీయించుట జరుగు చుండును. ఆభరణాలు పెట్టుకోవడానికి వీలుగా ఆడపిల్లలకు ముక్కులు చెవులు కుట్టించు మర్యాద నేటికిని కలదు.

ఉపనయనము ఆర్యాచారము. ఇది ద్విజులందరికిని వర్తించును. కాని బ్రాహ్మణులలో మాత్రము మొన్నటి వరకూ కన్పట్టుచూ వచ్చి ఇటీవల అక్కడకూడా గగన కుసుమము అవుచున్నది. ఆయా వర్ణముల వారికి చెప్పబడిన వయసులో ఉపనయనసంస్కారమును పొంది, పచ్చగోచీలతో, పాలశదండములతో ''భవతీ, భిక్షాందేహి'' యని తల్లిని బిక్షవేడు లేత బ్రహ్మచారులు కూడ మనోహర దృశ్యమే. ఇది కాళిదాసు వంటి మహాకవిని ఆకర్షించింది. ''అజినాషాడధర ప్రగల్భవాక్ జ్వలన్నివ బ్రహ్మమయేన తేజసా''. తొలిసారి వేదాధ్యయనము వటువునకు శ్రావణ శుద్ధ పూర్ణిమనాడు ఆరంభింతురు. ఇదియే జందెముల పూర్ణిమ. ఇది బహుథా లుప్తప్రాయమైన ఆచారము. ఇంక ఆడపిల్లలకెన్నియో శిక్షణలు ఉంటాయి. ప్రధానంగా అవి బాలికను గృహిణిగా దిద్దడానికి అవసరమయిన ప్రణాళికలు. పూర్వపు సాంఘిక వ్యవస్థలో సమష్టికుటుంబము సదాచారము. ఆడపిల్ల పొరుగింట జీవించవలసిన విధాయకము అన్నికాలములందును అన్ని దేశములందును కలదు. అది యొక అసిధారావ్రతము. దానిలో విజయము పొందడానికి రెండే ముఖ్య ఉపాయములు. ఓర్పు, మితభాషిత్వము, మితభాషిత్వము. నేర్పడానికే కాబోలు మూగనోము అను విచిత్రాచారము ఏర్పడింది. సూర్యాస్తమయ సమయమున, సుభగం కరణము పూర్తిచేసుకొని కుంకుమ

భరణి అక్షతలు తీసుకొని బాలికలు పొరుగిళ్ళ ముత్తయిదువుల వద్దకు వెళ్ళి వారిచే అక్షింతలు వేయించుకు వస్తారు. ఇది మాంగల్యము పెంపొందించుట కొరకు. ఇంతసేపును ఆ పడుచులు పెదవికదపి మాట్లాడరాదు. పెద్దలైనవారు, కొంటెపిల్లలు వారి నియమ భంగం చేయించడానికై పలకరించినా, వారు మాట్లాడకూడదు. మూగనోము దీపావళి వెళ్ళిన మరునాటి నుండి కార్తిక శుద్ధ పూర్ణిమ వరకు ఒక పక్షము దినములు చేయుదురట. ఈ సందర్భంలో సూర్యాస్తమయ సమయమునందలి గ్రామీణ దృశ్యమును వర్ణించు మధురాతి మధురమైన జానపదగేయము కలదు.

పడమటా ప్రొద్దులు గ్రుంకేటివేళ
ఆవుల్లు గోవుల్లు వచ్చేటివేళ
అతివలూ కడవల్లు ఎత్తేటివేళ
చాకింటిమడతలూ తెచ్చేటివేళ
బీరాయి పువ్వుల్లు పూచేటివేళ

ఇవికాక ఇంకను చిన్న చిన్న నోములు, నియమాలు బాలికలకు ఉంటాయి. అలసత్వము, బద్ధకము మొద్దు నిద్దుర మొదలైన అవగుణాలు ఆడపిల్లలకు చెల్లవు. ఆ మాటకువస్తే అవి ఎవరికీ తగవు. బాలికలు ఎప్పుడూ శుభ్రంగా అందంగా ఉండడం నేర్పడానికై కొన్ని నోములు ఉంటాయి. చిట్టిబొట్లు, ఉదయ కుంకుమ మొదలైనవి ఇట్లాంటివి. వ్రతభంగమైతే కలిగే శిక్ష ఏమిటంటే ముసలి మొగుడు రావడము, సవతిపోరు ఏర్పడడం, కుంటీగుడ్డీ వంటి అవకతవకలుగల పిల్లలు కలగడం ఈ మొదలైనవి. ఏ మహిళకైనను ఇవి దుఃఖ హేతువులు.

పూర్వపు సంఘమునందు స్త్రీ జీవితమును నియమించే మూడు

సూత్రములను మనము గుర్తించాలి. స్త్రీకి స్వాతంత్ర్యము పనికిరాదు. (న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి) ఆమెకు ప్రత్యేక ఆర్థిక వ్యవస్థలేదు. ఆమెకు గృహవిద్యయే కాని పైవిద్య లంతగా అవసరముకాదు. ఇది మారుపేరులో బానిసత్వంకాదా అంటే అవుననీ కాదనీ రెండు విధాలా సమాధానం చెప్పవచ్చును. ఈనాటి వ్యక్తి స్వాతంత్ర్య దృష్టితో చూస్తే పూర్వ సంఘమందు మహిళకు ఇవ్వబడిన స్థానము రెండవరకపు పౌరునిస్థాన మని అంగీకరించాలి. అయితే ఇరువదవ శతాబ్దం వరకూ ప్రపంచం అంతా అట్లాగే ఉండేది. ఇప్పుడిప్పుడే ఆ స్థితి మారుతుంది. అందుచేత స్త్రీలు చేసే నోములు, వ్రతాలు, నియమాలు అన్ని ఆమె గృహరాజ్ఞీత్వమునకు దారి తీసేవిగానే ఉంటాయి. స్త్రీలు చేసే కొన్ని వ్రతాలు శ్రావణ మాసంలో మంగళగౌరీ వ్రతము, వరలక్ష్మీ వ్రతము, పోలేరమ్మ మొదలగు గ్రామ దేవతల ఆరాధనము ఉండ్రాళ్ళ తదియ, బతకమ్మ పండుగ, అట్లతదియ, నాగులచవితి, బొమ్మలనోము, రథసప్తమి మొదలైనవి. పోలేరమ్మను కొలుచుట దేశీయాచారమని వ్యక్తమవుతూనే ఉంది. మొక్క మొలిచిన కందదుంపను త్రవ్వితెచ్చి, పసుపు కుంకుమ మొదలైనవి అలంకరించి పూజిస్తారు. కందపిలక వలె సంతానాభివృద్ధి అవుతుందని వాడుకొనడం ఆర్యులలోనూ ఉండేది. మహారాజులైన వారి పట్టాభి షేక మందు 'తెల్లగడ్డ' వాడవలెనని వైదికాచారము. అట్లు వాడినచో ఆ రోజె తెల్లగడ్డ భూమిలో అల్లుకొని పోయినట్లు, తన ప్రజానీకంలో అల్లుకొనిపోయి సుప్రతిష్ఠితుడు అవుతాడట. పోలేరమ్మను గూర్చిన హాస్యగేయము కలదు. కొంటె వాడైన శ్రీకృష్ణుడు దీనికి నాయకుడు. గోపికలు యశోదమ్మతో ఇట్లా షికాయతు చేస్తారు.

గోపికలు - పోలేరమ్మకు మేము పిండీరుబ్బుకొంటె

బోర్లతోసి పోయే మీ వాడు
అయ్యో, బోర్లతోసిపోయే మీ వాడు
యశోదమ్మ- మావాడు కాడమ్మ, మరియెవ్వరోకాని
మందలో ఉన్నాడు మావాడు
మందలో ఉన్నాడు మావాడు
గోపికలు- పోలేరమ్మకు మేము కోక తెచ్చుకుంటె
గోచీ చింపుక పోయే మీ వాడు
అయ్యో, గోచీ చింపుకపోయే మీవాడు
యశోదమ్మ- మావాడు కాడమ్మ మరి యెవ్వరోకాని
మందలో ఉన్నాడు మావాడు
గోపికలు- పోలేరమ్మకు మేము వేట తెచ్చుకుంటె
వాత పెట్టిపోయె మీ వాడు -
ఇట్లా చమత్కార సంభాషణ నడుస్తుంది.

ఉండ్రాళ్ళ తద్ది (తదియ) భాద్రపద బహుళ తదియనాడును, అట్లతద్ది (తదియ) ఆశ్వయుజ బహుళ తదియ నాడును, స్త్రీలు పాటించు ఆచారములు. ఈ దినములలో తలయంటి పోసుకొని, గోరంటాకు పెట్టుకొందురు. గోరంటాకు గోళ్ళకు లలిత రాగమును గూర్చు ద్రవ్యము. ఇది మాంగల్య చిహ్నముగా ధరింతురు. అందమునను ఇచ్చును. అట్లతదియనాడు చంద్రునివలె తెల్లనైన అట్లు పోసి శారదచంద్రుని పూజించి నైవేద్యము పెట్టుదురు. చంద్రదర్శనం చెయ్యకుండా భోజనం చేయకూడదు. సుకుమారియైన రాచవారి అక్కమ్మ ఆకలికి ఉండలేక చంద్రుడు రాకుండానే అన్నం తిన్న దోషమునకై ఆమెకు ముసలి మొగడు అందనికారమైన పిల్లలు సంభవించారని కథ చెప్పుకుంటారు. అట్లతదియనాడు తెల్లవారగట్లే పెరుగు

అన్నం తిని వెన్నెట్లో ఆడపిల్లలంతా ఆడుకుంటారు.

అప్పుడు కాబోలు ఈ పాట పాడుతారు.

ఉట్టి క్రింద ముద్ద -
గూట్లో రూపాయి
నీ మొగుడు సిపాయి

దీపావళినాడు పిల్లల సంరంభముగదా, గోగుచెట్లు తెచ్చి వాటికి చివర గుడ్డలు చుట్టి నూనెలో ముంచి ముట్టించి పిల్లలు చక్రాకారంగా తిప్పుతారు. అప్పుడు పసివారు ఇట్లాపాడుతారు.

దిబ్బూ దిబ్బూ దివ్వెల పండుగ
నుళ్ళీ వచ్చే నాగుల చవితి
ఎప్పుడు తిందును-చలిమిడిముద్ద-

బతకమ్మ పండుగ విస్తారంగా తెలంగాణాలో స్త్రీ లోకమునందు వాడుకలో ఉంది. ఇది దసరా పండుగతో సరిపడును. భాద్రపద బహుళ అమావాస్య మొదలుకొని ఆశ్వీయుజ శుద్ధనవమిదాకా నడుస్తుంది. ఈ దినములలో స్త్రీలు రకరకాల పూవులను సేకరించి, చిత్రంగా పేరుస్తారు. ఆ పేరే బతకమ్మ. ఆ తల్లిని కొలుచుటకై మాపటివేళ స్త్రీలందరు సమావేశమై నృత్యం చేస్తూ పాటలు పాడతారు.

''బతకమ్మ! బతకమ్మ! ఉయ్యాలో
నీ బిడ్డ పేరేమి - ఉయ్యాలో
ఇద్దరక్కా చెల్లెండ్రనుయ్యాలో
ఒక్కటే ఊరిచ్చి రుయ్యాలో

ఒక్కడే మాయన్న ఉయ్యాలో
వచ్చున్నపోడాయె ఉయ్యాలో
ఏట్లొత్తు చెల్లెలా ఉయ్యాలో
ఏరు లడ్డామాయె ఉయ్యాలో''

ఇట్లా నడుస్తుంది ఈ గేయము. పదవ రోజున బతకమ్మను చెరువులో వాలారించి చల్దులు తిని ఇంటికి వచ్చేస్తారు. కావున దీనికి చల్దుల బతకమ్మ అనియు పేరు. అంతకుముందు మహాలయపక్షంలో బొడ్డెమ్మ పండుగ అని కన్నెపిల్లలు చేసుకుంటారు. వాళ్ళూ ఇట్లాగే గొబ్బి తట్టుతూ నృత్యం చేస్తారు.

నాగులచవితి స్త్రీలు మిక్కిలి భక్తి శ్రద్ధలతో పాటిస్తారు. కార్తీక శుద్ధ చవితినాడు ఈ వ్రతము చేస్తారు. ఇంట్లో నాగ ప్రతిమలు ప్రతిష్ఠించి కాని, పాము పుట్టవద్దకు వెళ్ళి పాలుపోసి కాని నాగేంద్రుని మొక్కుకుంటారు. నాగేంద్రునకు దీపము పనికిరాదు. అందుచేత దీపము పెట్టరు. వేడివస్తువు పనికిరాదు. ఉడికించని ఆహారమే వినియోగింతురు. ప్రధానముగా చలిమిడిచేసి తిందురు. ఇది కడుపు చలవకోసమని స్త్రీల విశ్వాసము. పురుషులు కొన్ని కర్మలలో పితృపితామహ ప్రపితామహులను పేర్కొన్నట్లే నాగేంద్రుని కొలిచే సందర్భంలో స్త్రీలు, తాను, అత్త, అత్తగారి అత్త మూడుతరాల స్త్రీలను పేర్కొంటారు. ''శేషమ్మ కొలిచిన నాగేంద్రుడా! సీతమ్మ కొల్చిన నాగేంద్రుడా! శ్రీశైల భ్రమరాంబ కొలిచే నాగేంద్రుడా! చీకటా వాకటా మావాళ్ళు నడుస్తుంటారు. తోక తొక్కితే తొలగిపోయి, నడుము తొక్కితే నావాళ్లనుకొని, పడగతొక్కితే పారిపోయి వాళ్ళని రక్షించు'' అని ప్రార్థిస్తారు. ప్రాచీనాంధ్రులు నాగారాధకులు. నాగజాతివారు అనికూడా కొందరు చారిత్రకులు చెప్పుతారు.

పామరజనుల్లో ఉండే మరొక ఆచారం పేర్కొనవచ్చును. దీనిని 'బోనాలు' అంటారు. దీనిని సాధారణంగా శ్రావణ మాసంలో చేస్తారు. ఒక ప్రత్యేక దినమనే నియమంలేదు. దీని యుద్దేశము గ్రామ దేవతను సంతృప్తిపరచడం, కలరా మున్నగు వ్యాధులువచ్చే కాలం కనుక వాటి నుండి గ్రామ ప్రజలను కాపాడమని గ్రామ దేవతను కొలవడమే 'బోనాలు' అనే ఆచారముయొక్క లక్ష్యము. బోనము అనగా అన్నము వండి, పెరుగు, తీపి పిండివంట (అరిశెలు) చేసి. ఒక గిన్నెను పసుపు కుంకుమలతో అలంకరించి, బోనమును దానిలోనుంచి గ్రామ దేవతకు సమర్పింతురు. పిదప నైవేద్యమైన బోనమును చాకళ్ళుగాని కుమ్మరులుగాని తీసుకొని వెళ్ళుదురు.

బొమ్మల నోము అనే వ్రతాన్ని కొత్తగా పెళ్ళయిన బాలికలు సమూహంగా ఏర్పడి చేసుకొందురు. దీనిని సంక్రాంతి వెళ్ళిన కనుమునాటి నుండి తొమ్మిది దినములు చేయుదురట. ఇదే సావిత్రీ గౌరమ్మపూజకు సంబంధించినది. బాలికలంతా బాజాభజంత్రీలతో కుమ్మరి యింటికివెళ్ళి ధాన్యం మొదలైనవి కట్నంగా ఇచ్చి బొమ్మలు చేయించుకొని తెచ్చుకుంటారు. ఏడు నుండి తొమ్మిది బొమ్మలు చేయించు కొంటారు. అందులో ఒక బొమ్మ పంచాంగ బ్రాహ్మణుడు. దినమున కొక పిండివంట చొప్పున నైవేద్యం పెట్టుతారు. తొమ్మిది దినాలు కొలిచి బొమ్మల్ని ఏటిలో కాని చెరువులో కాని వాలారిస్తారు. రథసప్తమినాడు స్త్రీలు పాలపొంగలి చేసి సూర్యనారాయణమూర్తిని ఆరాధిస్తారు. సంవత్సరాది లేక ఉగాది కొత్తబట్టలు కట్టుట, వేపపూవు మామిడి పిందెలతో గూడిన పచ్చి పులుసు. అరగించడము - ఇవి సర్వజన విదితములు.

పురుషుల ఆచారములు వైదిక - పౌరాణిక సంప్రదాయములకు

దగ్గరగా ఉంటాయి. శ్రీరామనవమి, శ్రీ కృష్ణాష్టమి శ్రావణ పూర్ణిమ, విఘ్నేశ్వర చవితి, విజయదశమీ యాత్ర, శమీ సందర్శనము, గ్రామములోని శివకేశవాలయములందలి కల్యాణోత్సవములు, సంక్రాంతి వేడుకలు, భోగిమంటలు, భీష్మైకాదశి, కాముడిపున్నమి, శివరాత్రి జాగరములు వంటివి పేర్కొనవచ్చును. దసరా దినములలో నవరాత్రములు, సరస్వతీ పూజ వాని నాడించుచు కట్నములు సేకరించుట, అప్పటి వారి జానపద వీర నృత్యములు స్మరింపదగియున్నవి. సంక్రాంతికి కోడి పందెములు, పొట్టేళ్ళ పందెములు కొన్ని ప్రాంతాల్లో సాగుతాయి. దొమ్మరాటలు, తోలుబొమ్మలాటలు, పగటి భాగవతులు, కల్యాణోత్సవములందు పగ్గములు కట్టి దేవుని రథము లాగుట, దేవుని పల్లకీలు మోయుట వేసవియందు చలివెందలలు నడుపుట వెన్నెల కోలాటములు, మొదలైనవి పురుషుల వినోదములు.

భారతీయులందరికిని తీర్థములు, జాతరలు, సంతలు మొదలైనవి ప్రాచీన కాలము నుండియు ప్రీతిదాయకములు. యాదవ వంశ ప్రళయము జాతర సందర్భముననే జరిగినట్లు మహాభారత మౌసల పర్వమునందు కలదు. వీటినే తిరునాళ్ళు అనుటయు కలదు. చిల్లర గ్రామదేవత నుండి ఏడుకొండల స్వామి వరకు ఆరాధనకొరకై సంవత్సరమున ప్రత్యేక సందర్భముల దినములు కలవు. అట్టి పుణ్యదినమునకు దూర దూరము నుండి భక్తులు స్త్రీ పురుషులు బృందములు కట్టివచ్చి దేవునికి మొక్కులు చెల్లించుకొని, తీర్థము చూసి, వలసిన వస్తువులు కొనుక్కొని వెళ్ళిపోవు చుందురు. యాత్ర వెళ్ళి పాత్రతెచ్చుట సామెతయైపోయినది. ఇప్పటివలె పూర్వకాలమున నగరములు అంతగా లేకుండటచేతను, రకరకములైన సామగ్రులు వలసిన చోట్లలో లభింపకపోవుటచేతను, తీర్థములు వర్తక

స్థానములుగా కూడా ఉపయోగించెడివి. ఒక్కొక్కప్పుడీ తీర్థములు అనారోగ్యకేంద్రములుగా పరిణమించేవి. ఆ జనసమూహములందు ఆరోగ్య వ్యవస్థ చేసెడివారు లేకుండిరి. తిరునాళ్ళలో అవినీతి కూడ తాండవించెడిదని శ్రీనాథాదులు వర్ణించిరి. తీర్థముల దోషము లెట్లున్నను అవి మంచి సాంఘిక ప్రయోజనమునే సాధించెడివి. అనేక కళలను, చేతిపనులను ప్రదర్శించుటకు జాతరలు మంచి రంగములుగా ఉపయోగ పడెడివి.

తీర్థము లేని గ్రామమే లేదనుట అతిశయోక్తి కాదు. యాత్రికులు వేల సంఖ్యలో వెళ్ళే పుణ్యస్థలములు ఆంధ్రదేశంలో అసంఖ్యాకములుగానే ఉన్నవి. తిరుపతి, అన్నవరము, భద్రాద్రి, సింహాద్రి, అంతర్వేది, శ్రీశైలము మహానంది వంటివి లెక్కలేనన్ని, దేవతాస్థానములును తక్కువ కాదు. బెజవాడ కనకదుర్గ, అనుమకొండ పద్మాక్షి, పానపల్లి పళ్ళాలమ్మ వంటి దేవతలే గొప్ప మహిమ గలవారని జనుల విశ్వాసము. కేవలశైవులైనవారు ప్రభల తీర్థము నిర్వహింతురు. మన దేశమునందు పూర్వము జైనమతము బాగుగా వ్యాప్తిలో నుండెడిది, తరువాత శైవము దానిని వెనుకకు నెట్టినది. వీరశైవ విజయమునకు చిహ్నముగా ప్రభల తీర్థము ఏర్పడినదేమోయను సందియము జనించును. తెరచాపల వంటి వస్త్రములతో ప్రభలను నిర్మించి, మోకులపైనెత్తి యూరేగింపు తీసికొనిపోవుదురు. అప్పుడు భక్తులు కత్తులు మొదలైన ఆయుధములు దాల్చి వీరత్వ ముట్టిపడునట్లు '' అశ్శరభ, శరభ అల్లల్లభీర నీ గ్రుడ్లు తీయిస్తునా నీ పళ్ళు పీకిస్తునా '' అని భీకర నినాదములు చేయుచు సాగిపోవుదురు. సాధారణముగా పంచాణమువారును సాలెవారును ఇట్టి వీరభక్తి ప్రదర్శనములు చేయుచుండినట్లు కాన్పించును.

ఇటీవల చారిత్రక నాగరికత గ్రామసీమలోనికి కూడ వ్యాపించుట

చేతను, రాకపోకల సౌకర్యములు విస్తారముగ అభివృద్ధి చెందుట చేతను, పూర్వాచారములుమోటుగా తోచుటచేతను, సినిమా-రేడియో వంటి ఆధునిక వినోద సాధనములు, విస్తరిల్లుటచేతను జనపదము నందలి ప్రజలు కూడ పెద్దల వేడుకలను విస్మరించి విసర్జించుచున్నారు.

-ఖండవల్లి లక్ష్మీరంజనం

నిత్యజీవితంలో వేమన

ప్రాచీనాంధ్రకవుల్లో వేమనది ప్రత్యేకమైన గొంతు. ఒకే పోతలో పోసిన ప్రబంధాలు ఉసిళ్ళలాగా ఉత్పన్నమవుతున్న రోజుల్లో నేరుగా ప్రజాజీవితంలో నుంచి వస్తువు నేరుకున్న ప్రజాకవి వేమన. అంతేకాదు, ఆదికవి వాల్మీకి అనుష్టుప్పువంటి చిన్నవృత్తంలో అంతటి మహాగాథను పలికించినట్లు వేమన ఆటవెలదిలాంటి పొట్టిపద్యంలో ఆకాశాన్ని ముట్టే భావాలు ప్రకటించాడు. ఆ మహానుభావుడే అన్నాడుగదా-కొండ అద్దమందు కొంచెమై యుండదా అని కొలిస్తే అందని ప్రజాజీవితంలోని విస్తృతినీ, ఉన్నతినీ ఆటవెలదిలోని చిన్న చిన్న పాదాల్లో అందంగా పొదిగాడీతడు. ఆ ఆటవెలదిలో కూడా చివరిపాదంలో విశ్వదాభిరామ వినురవేమ అనేది విధిగా ఉండేదే. ఇకపోతే మిగిలినవి మూడుపాదాలే. ఈ మూడు పాదాల్లో ముల్లోకాలను ముడివేసేంత ఆలోచననూ, అనుభవాన్నీ అందించాడీతడు

వేమన పదిహేడో శతాబ్దికి చెందిన కవి. అంటే ఇప్పటికి మూడువందల సంవత్సరాల వెనకాల ఉన్నకవి. ఈ మున్నాళ్ళనుంచీ వేమన జీవించేవున్నాడు తాటాకు పుటల్లోనో, రాగిరేకుల్లోనో కాదు. ప్రజల నాల్కలమీద, భావుకుల హృదయఫలకాలమీద.

కర్పూర తాంబూలం నములుతున్నప్పుడు, కన్నీళ్ళు చెక్కిళ్ళమీద చిందినప్పుడు, ఎవరినైనా ఎగతాళి చేసేటప్పుడు, ఎవరిపట్లనైనా సానుభూతి

ప్రకటించేటప్పుడు, నిజం కల్లగా దొర్లినప్పుడు, కల్ల నిజమై పల్లవించినప్పుడు, ద్వేషం, హాసం, విషం, అమృతంలాంటి విభిన్న లక్షణాలున్న ప్రవృత్తు లెదురైనప్పుడు, సర్వసామాన్యంగా ఏమాత్రం తడివున్న మనస్సులోనైనా తళుక్కున స్ఫురించేది వేమన సృష్టించిన ఆటవెలదే. మన నిత్యజీవితంలో వేమనలాగా కలిసిపోయిన కవిలేడు. వింజామరల్లా ఉపకరిస్తాయి. పురుషార్థాల్లోని పొరల్ని విడదీసి చెప్పడానికి, అంతేకాదు- మనం నలుగురం కూచొని నవ్వేవేళల్లో వేమన పద్యాలు అంతరంగానికీ, బహిరంగానికీ ఉన్న అంతరాలను విప్పి చూపడానికి వేమనపద్యాలు వెలలేని భాష్యాలుగా పనికివస్తాయి.

వేమనపద్యాలకు వస్తువు మనం బదికి బట్టకట్టి తిరుగుతున్న సమాజంలోనే పుష్కలంగావుంది. ఆయనకు ఏ పురాణాల్లోనుంచో ఇతిహాసాల్లోనుంచో వస్తువరణ చేయవలసిన అవసరం లేకపోయింది. అంత మాత్రాన అతను పురాణాలను ఇతిహాసాలను అసలే స్పృశించలేదని కాదు. అక్కరగలిగినప్పుడు పౌరాణికాంశాల డొక్కచీల్చకుండా ఉండలేడితడు.

'కులము నీరు చేసి గురులను వధియింప
బొసగ నేనుగనుచు బొంకు బొంకె
పేరు ధర్మరాజు పెనువేపవిత్తయా'

అని ధర్మరాజు శీలంమీదనే ధ్వజమెత్తాడు. అప్పుడప్పుడు ఇలా అధిక్షేపం నిమిత్తం పురాణ విషయాలను తీసుకున్నా, వేమన గ్రహించిన వస్తువు ప్రధానంగా సాంఘికమే. సాంఘికమంటే మున్నూరేళ్ళ క్రిందటి సమాజానికి సంబంధించికదా పాతపడిపోలేదా ? నాటి న్యాయాలు నేడు చెల్లని నాణాలుకావా? వేమనకు సంబంధించినంతవరకూ ఈ ప్రశ్నలు పట్టి

ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. వేమన నీతులూ, సూక్తులు, అన్నీ ఇరవయ్యో శతాబ్ది సమాజాన్ని అక్షరాలా ప్రతిబింబిస్తాయి. ఆయన తీసుకున్న ఉపమానాలన్నీ ఈనాటికీ వర్తిస్తాయి. ఆయన చేపట్టిన వస్తువు ఈనాడు సజీవంగా కనిపిస్తుంది. అంటే వేమన తీసుకున్న విషయాలు చెప్పినతీరూ, శాశ్వతత్వముద్ర గలవన్నమాట. ఇక మన నిత్యజీవితంలో వేమన పద్యాలు ఇంత సజీవంగా ఉండటానికి కారణమేమిటో చూద్దాం.

లోకంలోని మంచినీ, చెడునూ, ఎత్తునూ, పల్లాన్నీ చెప్పడానికి వేమన తమాషా పద్ధతిని అవలంబించాడు. లోకంలో పరస్పర విరుద్ధగుణాలు కలిగివున్నా, బయటికంత విభిన్నంగా కనిపించని పదార్థాలు కొన్ని వుంటాయి. ఉప్పును తీసుకున్నాడు, కప్పురాన్ని తీసుకున్నాడు. రెంటి రూపంలో పోలిక వుంది. నాల్కమీద వేసిచూస్తే రెంటి రుచీ వేరు ఇది సత్యం. శాశ్వతం. ఈ సత్యం వేదాంతానికా సంబంధించినది కాదు. వేదాంతంలో సత్యమంటే పరబ్రహ్మమే. మిగతా అంతా అసత్తు అంటే మిథ్య. వేమన ఇలాంటి సత్యాలజోలికి పోలేదు. అతడు చూసింది లౌకిక సత్యం. ఉప్పు, కర్పూరము ఒకేరకంగా కనిపించడం లౌకిక సత్యమే. ఈ సత్యాన్ని నిరూపించడానికి ప్రయత్నించాడు. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అని నిరూపించడమది. లోకంలో అందరూ మనుషుల్లాగే కనిపిస్తారు. కాని వారిలో కర్పూర గుణమున్న పుణ్యాత్ములు వేరు. పురుషుల్లో పుణ్యపురుషులు వేరు అని బోధచేస్తేజనం వినదు. ఉప్పునకూ, కర్పూరానికీ ఉన్న తేడాను నిరూపిస్తే జనం వెంటనే తలూపుతుంది. రెండు పరస్పర భిన్నగుణాలుగల వస్తువుల్ని ఏరి వాటి ద్వారా ఒక మహాసత్యాన్ని చెప్పడం వేమన ప్రత్యేకత. ఈ సూత్రం ఆధారంగానే వేమన రాయీ రత్నం, గంగిగోవూ ఖరమూ, కంచూ కనకం, మానూ మనసూ మొదలైన విభిన్న

విషయాలను గ్రహించి వాటిని విశ్లేషించి, సమన్వయించి, అప్రియమైన సత్యాలనుగూడ హాయిగా అందించాడు. మన ఆరోగ్యం పెంచాడు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారన్నట్లుగా వేమన కవితాశక్తి రెండుప్రక్కలా పదునున్న చురకత్తి లాంటిది. దానిని ప్రయోగించేటప్పుడు అతనికి జంకు గొంకుల్లేవు. లోకం డబ్బుచుట్టూ గిరగిరా తిరుగుతుంది. గుణంతో నిమిత్తంలేకుండా ధనానికి పీటవేస్తుంది. ఈ నగ్న సత్యం అందరెరిగినదే. దాన్నే వేమన ఎంతో పదునుగా ఇలా అధిక్షేపించాడు.

''కులము గలుగువారు గోత్రంబు గలవారు

విద్యచేత విర్రవీగువారు

పసిడిగల్గువాని బానిసకొడుకులు''

అలాగే

''చదువులందు పాడిమొదవులందును స్త్రీల

పెదలవుందు రాజ్యపదవులందు

ఆశ లుడిగినట్టి అయ్యలుగలరొకొ''

అని సూటిగా ప్రశ్నించాడు. కాదనడానికి ఎన్ని గుండె లుండాలి. వేమన కాలంలోనే కాదు. ఈ కాలంలోనూ వాటిమీద ఆశలుడిగినవాళ్ళెవరు? ముఖ్యంగా 'రాజ్యపదవులందు' ఆశలు రోజురోజుకీ ముదిరిపోతున్న విషయం మనం నిత్యంగమనిస్తున్నదే.

వేమనకు విగ్రహారాధనమన్నా అడవుల్లో తపస్సు చేయడమన్నా మతం

పేరిట వేషాలు వేయడమన్నా గిట్టదు. అసలు వాటి మీద ఈయనకు ప్రత్యయమే లేదు. అందువల్ల వాటిని తలచుకున్నప్పుడల్లా పరిహాసం స్ఫురిస్తుంది..

ఏ కొండగుహల్లోనో తపస్సు చేసి మోక్ష సిద్ధి పొందడం ఈయన దృష్టికి హాస్యాస్పదంగా కనిపించింది. అందుకే ఇలా అంటాడు.

'గుహలలోనజొచ్చి గురువుల వెదకంగ

క్రూరమృగ మొకండు తారసిలిన

ముక్తిమార్గ మదియె ముందుగా జూపురా.'

గ్రాసవాసోద్దైన్యాన్ని పొంది గుహల్లో తపఃక్లేశం అనుభవించే యోగుల్ని ఒక త్రోపుతో త్రోసివేశాడు. వాళ్ళను ఏ మృగమో పొట్టబెట్టుకుని ముక్తిని ప్రసాదిస్తుందట.

వేమన విజ్ఞానం పుస్తకాలమీద ఆధారపడింది కాదు. లోకమే అతని పుస్తకం. లోకంలోని వివిధ సంఘటనలనూ, ప్రవృత్తులనూ సమీకరించి నిలిచిపోయింది. దానికి ఉపమానంగా పొట్లకాయను తీసుకోవడంతో వేమన నిత్యజీవితంలోని వివిధాంగాలను ఎంత నిశితంగా పరిశీలించాడో తెలుస్తుంది.

ఈ భావాన్నే-

'మ్రాను దిద్దవచ్చు మరి వంక లేకుండ

దిద్దవచ్చు రాయి తిన్నగాను

మనసు దిద్దరాదు మహిమీద నెవరికి,

అనే పద్యంలోనూ బలపరిచాడు. నిత్యజీవితంలో సర్వసామాన్యంగా కనిపించే వస్తువుల్ని తీసికొని వాటి నుంచి నీతిని పిండుకోవడంలో వేమన విశిష్టత యేమిటో పైన వివరించబడింది. సామాన్య విషయాల్లోనుంచి తాత్త్వికమైన పారలౌకికమైన అభిప్రాయాలను తరచి తీయడంలోనూ వేమన అంతటి సమర్థుడే.

'ఆకు వక్క సున్నమవి మూడు వన్నెలు
ఏకమైన చోట తాకు నెరుపు
సోకి త్రిగుణ మట్లు శోభించు పరమాత్మ'

తాంబూలాన్ని తీసుకున్నాడు వేమన, తాంబూలంలో ముఖ్య పదార్థాలు మూడు, ఆకు, వక్క, సున్నం, వీటి వన్నెలు వేరు. ఈ మూడు వన్నెలు వేరు. ఈ మూడు వన్నెలు మేళనం పొందినప్పుడు ఒక కొత్తవన్నె- ఎరుపువన్నె- పుడుతుంది. తాంబూలరాగం అందరూ ఎరిగిందే. ఈ మామూలు సత్యాన్ని గ్రహించి వేమన చాలా ఎత్తు ఎగిరాడు. పారలౌకిక ప్రపంచం లోకి వెళ్ళిపోయాడు. మానవుని మనస్సు త్రిగుణాత్మకం, సృష్టి త్రిగుణ హేతుకం . త్రిగుణ సమ్మేళనం పర మాత్మ దీప్తికి దారితీస్తుంది. ఇంతటి తాత్త్విక విషయం చెప్పడానికి వేమన తీసుకున్న తాంబూలోపమానం ఆశ్చర్యం కలిగిస్తుంది. మనం పూర్తిగా విస్మరించినా గుర్తించక విసర్జించినా అతడు నీతిని బోధించాడు. జారకాంత సాంగత్యాన్ని నిరసించడానికి ఇతడు తీసుకున్న ఉపమానం చూడండి.

'ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగయేరినయట్లు'

పరిగ అనేది వ్యవసాయసంబంధమైన పదం. ఎదిగిన పంటను కోసుకున్న

తర్వాత అక్కడక్కడా రాలిపడివున్న గింజల్నిగానీ మిగిలిపోయిన పంట మొక్కల్నిగానీ పరిగ అంటారు. పంట చేనుండగా దాన్ని విడిచి పరిగ ఏరుకోవడం ఎంత అవివేకమో, ఇల్లాలిని విడిచి వెలయాలి వెంటపడడం అంతే అని వేమన అందించిన వెచ్చని నీతి. ఈ నీతిని ప్రబోధించడానికి పంటచేనునూ, పరిగనూ ఉపమానాలుగా తీసుకోవడం అతని పరిశీలనశక్తికి నిదర్శనం. అలాగే మరోచోట ఇలాఅంటాడు.

'పొట్లకాయ రాయి పొదిగి త్రాటనుగట్ట
లీల తోడ వంకలేక పెరుగు
కుక్కతోకగట్ట చక్కగా వచ్చునా'

పొట్లకాయకు వంకరగా ఎదిగే గుణముంది. అందువల్ల దానికి వంకర లేకుండా చేయడానికి రాయి వేలాడగడుతారు. అది క్రమంగా చక్కగా ఎదుగుతుంది. మరి కుక్కతోకకు ఇలా చేసినా చక్కగా అవుతుందా అని వేమన ప్రశ్న. కాదని సమాధానం. కుక్కతో కంటే మూర్ఖుని చిత్తమన్నమాట. సూటిగా మూర్ఖుని చిత్తమనక కుక్కతోకను సంకేతంగా తీసుకోవడంలో ఉద్దేశమేమిటి? కుక్కతోక చక్కగరాదనే విషయం సుప్రసిద్ధం. అసలు కుక్కతోక వంకర అనే విషయం మూర్ఖుని వక్రబుద్ధికి పర్యాయంగా లోకంలో తలచిన సామాన్య విషయాలను పరిశీలించి వాటిద్వారా పరతత్వ నిర్దేశం చేయడం మాటలా? అలాంటి గారడీ వేమన్నకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే వేమన మన నిత్యజీవితానికి అంత సన్నిహితుడైనాడు. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ఆయన్ని స్మరించకుండా ఉండలేము. ఆంధ్రజాతి ఊపిరిలో ఊపిరిగా కలిసిపోయాడతడు. అందుకే అతణ్ణి మన వేమన అనాలనిపిస్తుంది.

- డా. సి. నారాయణరెడ్డి

దాసరి పాట

1

అతడు తెలగదాసరి. అతని నివాసస్థలము తెలుగుదేశము, అతని పరివారము, చుట్టములు, అతని భార్యే. అతని ఆస్తి ఒక తాంబ్రా, ఒక గుమిసీ, ఒక జత అంజెలులు.

అతని దృష్టి యెప్పుడూ పదములలో దాగియున్న తెలుగు వీరుల మీదనే. అతని ఆశయము యెప్పుడూ తెలుగు దేహములను పదములు పాడి పులక లెత్తించడమే.

అతడు చూడని తెలుగుగ్రామములేదు. అతడు మెట్టని తెలుగు దేశములేదు. అతని పాటలు వినని తెలుగువారు లేరు- కొందరు నవనాగరీకులు తప్ప.

మరాటీ మనుష్యులవలె యెఱ్ఱని పెద్ద తలపాగా పెట్టుకొని చిరిగిపోయిన పాతకోటువేసుకొని పాత జరీకండువా వల్లెవాటుగా ధరించి పంచె యెగగట్టి భుజముమీది తాంబ్రా వేళ్ళతో మీటుతూ మెళ్ళో పూసలు కదిలేటట్లు చిందులు తొక్కుతూ అతడు మరాటీకథపదము చెప్పేటప్పుడు వీరరసము ఉట్టిపడేది. అతని బొమముడికి పెట్టుకున్న నామము పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయేది. బొటనవేలుకి తర్జనికీ తగిలించుకొన్న అంజెళ్ళు ఖంగున మోగేవి. పక్కనే కూర్చున్న అతని భార్య గుమిసిమీదమోకాలు పెట్టి

భర్త ముఖముమీదనే వీక్షణ ములుంచి గుమిసి వాయించునపుడు భర్త చెప్పు పదమునకు మరింత గాంభీర్యము వచ్చేది. జనులు ముగ్ధులై పోయేవారు.

అతనికి యిరవయ్యోయేట పెళ్ళైనది. పెళ్ళైనది మొదలు నేటివరకూ అతని భార్య అతని వద్దనే ఉన్నది. పెండ్లినాటికామెకు పద్నాలుగోయేడు. ఆమె తండ్రి కూడా ఒక తెలగదాసరే, కాని అతడు అకాల మృత్యువు వాతపడుటచేత ఆమె తల్లివద్దనే ఉండి చాలా దరిద్ర మనుభవించింది. కాని కొన్ని పదములు నేర్చుకొంది. తల్లిదగ్గరనున్న కాలములో ఆమెకు తల్లే సర్వసమున్నూ. పెళ్ళిచేసుకున్న తర్వాత ఆమెకు భర్తే సర్వమూ. భర్త దగ్గర ఆమె గుమిసివాయించడం నేర్చుకుది. భర్త దగ్గర ఈమె కొత్త పదము లనేకనులు నేర్చుకొన్నది. భర్త పాడేటప్పుడు అతని పాటకు తాను ఊతపదమును కలిపేది. వారి హృదయాలకు అద్వితీయ స్థితి లేనట్టే వారి పాటకు కూడా లేదు.

పదములోని వీరరసమును భర్త వెలువరించేటప్పుడు ఆమె హృదయము వీరరసముతో ఉప్పొంగేది.

కరుణరసము తన పదమునకు భర్త ఒప్పించేటప్పుడు కళ్ళవెంబడి వచ్చిన కన్నీళ్ళు గుమిసినితడిపేవి. 'తందాన తాన' అనే ఊత పదము గద్గదమయ్యేది.

భర్త చమత్కారము చూచి చిరునవ్వు నవ్వినప్పుడు అమె గుమిసి దెబ్బలలో నవ్వు వినిపించేది.

కొంటెతనముతో అతడు మీసము మీద చెయ్యివేసి నాయికా నాయకుల శృంగారమును వర్ణించేటప్పుడు ఆమె తలవంచి గుమిసి తప్పు

వాయించేది.

భేదములేనివారి ప్రేమకు, కౌటిల్యమెరుగనివారి ప్రేమకు, దేహములు వేరైనను వారి ఆత్మలను ఒక్కటిగ చేసినవారి ప్రేమకు ఫలముగా వారికి ఒక కొడుకుపుట్టాడు. వానికి ఇప్పుడు ఐదోయేడు.

2

చదువుకున్న వాడంటే ఎవరు? వ్రాలు చేయగలవాడేనా వ్రాలుచేయలేని భట్రాజులు, దాసరులు. జంగములు, సాతానులు, వీథిభాగవతులు- వీరివగాటే మిటి? భారత భాగవతములను, మహావీరులదేశీయ కథలను ఇతరులకు బోధించగల వీరు చేవ్రాలు చేయలేనివారనే కారణముచేత చదువురాని వారని త్రోసివేయువచ్చునా? దేశములో కొందరు విద్యలను పోషించవలెను. కొందరు వృత్తులను పోషించవలెను. వృత్తులను పోషించేవారికి చదువులలో నిగ్గు తెలియాలి. దానికోసము సంఘములో కొందరు ఏర్పాటు కావాలి. భట్రాజులు దాసరులు మున్నగువారు ఇట్టివారు. వీరు సర్వసౌఖ్యములను పరిత్యజించి భిక్షుకవృత్తి అవలంబించారు పూర్వము. ముఖ్యముగా మత ప్రచారముకొరకై వారువారురు తిరుగుతూ భిక్షుకులై దేశములోని అజ్ఞానమును ఒకవిధముగాపోగొట్టుచున్నారు. వీరిని చూచి నేటివారు 'కూలి పని చేసుకోకూడదా? అనడం ఆచారమైన వంశపారంపర్యంగా వస్తూన్న ఆచారాలన్ని ఒక్కమారు వదలిపెట్టడం కష్టం. అయినా వారికి భైక్ష్యవృత్తి నీచముకాదు. వారి దేవుడే ఒక భిక్షకుడు కాబట్టి.

ఈ కాలపు ముద్రాశాలలకన్న వీరే సంఘమునకు ఎక్కువ ఉపయోగకరంగా ఉండేవారు. అచ్చుయంత్రము చదువువచ్చినవారికే, వీరు

అందరికీ ఉపకారము చేస్తున్నారు. మనదాసరి చాలాపాటలు పాడగలడు. బొబ్బిలి కథ, తిమ్మరాజు కథ, కోడిపుంజుల కథ, సర్వాయిపాపడుకథ, కామమ్మకథ, కాంభోజరాజుకథ, చెంచుకథ మొదలైన కథ లనేకములను రసవత్తరముగా వినిపించగలడు. ఈ పదములన్నీ ఇతని భార్యకుకూడా వచ్చును. వీరి అయిదేండ్ల కొడుకుకు అప్పుడే అయిదారుకథలు ఒక మోస్తరుగా పాడవచ్చును.

ఇంతవరకు వీరిని భగవంతుడు ఆదరముతోనే చూచేడు, ఎక్కడికి వెళ్ళినా వీరికి కడుపునిండా తిండిదొరికేది. తగిన బహుమానము దొరికేది. ఈ దాసరి దంపతులకు మొదట ఒకరిమీద ఒకరికి ఎంత అనురాగముండెడిదో వారి పాటలమీద కూడా వారికి అంత అనురాగమే ఉండేది. ఇప్పుడు వారిద్దరూ వారి పాటలకన్న వారికొడుకుని ఎక్కువ అనురాగముతో చూచుకొంటున్నారు. కొడుకును ఒకరువిడిచి ఒకరు ఎత్తుకొనేవారేగాని నడిపించేవారుగారు. తమకు ఒక ముద్దతక్కువచేసుకునైనా తమ కొడుకుకడుపు నిడించేవారు. అసాధ్యమైన కోరికలుచెల్లించి ఆపూటకి ఉపవాసము చేయడముకూడా అప్పుడప్పుడు కద్దు.

3

ఒకనాడు ఒక గ్రామములో దాసరి దంపతులు కోడిపుంజులకథ చెప్పుచున్నారు. దాసరి కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్కనే అతని భార్య వాద్యము వాయించుచున్నది. ఆమె ఒడిలో వారి పుత్రుడు పడుకున్నా. దాసరి చూపులు అతనిమీదనే తరుచుగా పడుచున్నవి. ఆమె పిల్లవాణ్ణే ఉండుండి అక్కున చేర్చుకొనుచూ ఊతపదము పలకడం మరిచిపోయేది. కోడిపుంజుల యుద్ధము వర్ణించేటప్పుడు చూపే ఉత్సాహము దాసరి ఆ

రోజున చూపలేకపోయేడు. రాజపుత్రుల పౌరుషవాక్యములు ఆనాడు నీరసములైనవి. ప్రజలందరూ అతని పాటనువిని పెదవి విరుచుకున్నారు. కొందరు ముసిలివడైనాడితడు. ఇక పదములు చెప్పలేడన్నారు. గర్వము బలిసినదన్నారు మరికొందరు ఇతన్ని చూచి.

ఆ రోజున వారికి రావలసినంత ఆదాయము రాలేదు.

ఆ రోజుకు సరిపడేటంత ఆదాయమైనా రాలేదు.

రాత్రి మూడుగంటలైంది. కథ ముగిసినది. ప్రజలందర ఇండ్లకు వెళ్ళిరి. దాసరి తనకొడుకు ఒంటిమీద చెయ్యి వేసి చూచేడు. ఒళ్ళు కాలిపోతూంది. దాసరిభార్య తనకొడుకు కాలికి వున్న కట్టువిప్పినది. దాసరి ఏదో పసరుముద్ద కాలిచీది గాయముమీద వేసినాడు. ఆమె మళ్ళీ కట్టు కట్టినది. దాసరి తన తలపాగా మెత్తగా వుండేటందుకు పక్కవేసేడు. దానిమీద తన కోటుపరిచేడు. దాసరి భార్య తన కొంగు ఆ పక్కమీద వేసి దాపిమీద బాలుని పడుకోబెట్టి అతనిపక్కనే తాను పడుకొన్నది. ఈ వలిపక్క దాసరి రాళ్ళమీద పడుకున్నాడు. తూర్పున ఉదయించిన చంద్రవంక మేలుకొనియున్న దంపతులకన్నీటి బిందువులలో ప్రకాశియింది. ఊరుబయట చెట్టుక్రింద పడుకొనివున్న దాసరి కుటుంబమునకు మరునాడు పాట పాడితేనేకాని పొట్టనిండదు.

4

రాత్రి యెనిమిదిగంటలైంది. రెండు కిర్సనాలు దీపాలు ఊరిచివర చెట్టుక్రింద వెలుగుచున్నవి. చుట్టూ ప్రజలు కూర్చుని ఉన్నారు. దాసరి ఒక భుజముమీద తాంబ్రా మీటుతున్నాడు. బొబ్బిలికథ చెప్తుతున్నాడు.

కూర్చునే చెప్పుతున్నాడు. యథాప్రకారము అతనిభార్య అతని ప్రక్కనే కూర్చున్నది భుజముమీది వారికొడుకు చిక్కి శల్యమైయున్నాడు. కాలి మీది కట్టు మరింత పెద్దదిగా ఉన్నది. ఉండుండి అతడు తలయెత్తి తండ్రికేసీ, తల్లికేసీ చూచి మళ్లీ బుజముమీద తలవాల్చి కూర్చుచున్నాడు ఆ రోజున జ్వరము తగ్గినదని తండ్రికి బెంగగా వుంది. బొబ్బిలి కథ క్రమక్రమముగా రక్తికట్టుచున్నదని ప్రజలనుకొనుచున్నారు. బొబ్బిలికోట ముట్టడించడానికి సైన్యములు పూనుకొనుచున్నవి. యుద్ధమును వర్ణించి దాసరి ప్రజల మెప్పును పొందేడు. రంగారావు వీరకృత్యములు ప్రజలలో ఆవేశమును కలిగించినవి. తాంబాతీగెలు కదలిపోవుచున్నవి. గుమిని ఖంగుమనుచున్నది. దాసరి యెలుగెత్తి రంగనాయకమ్మ మరణమునను విలపించాడు, ప్రజలకు కళ్ళనీళ్ళు గిర్రున తిరిగినవి. తల్లి భుజముమీద నున్న కొడుకువంటిమీద చెయ్యివేసి చూచినది. ఒళ్ళు చల్లబడుచున్నది. దాసరి ముఖముకేసి చూచిని. అతడు విజయరామరాజు క్రౌర్యమును వర్ణిస్తున్నాడు. కొడుకు హీనమైన స్వరముతో 'అయ్యా' అన్నాడు. ఒక చేతితో సానురాగముగా కొడుకును నిమిరి అతడు కథ సాగించాడు.

తాంద్ర పాపయ్యకు బొబ్బిలివీరుల మరణవార్త తెలిసినది. రౌద్రాకారుడైవచ్చి అతడు విజయరామరాజును చంపిన వార్త దాసరి పాడి ప్రజలకు తెలియజెప్పాడు. ప్రజలు తలవూపినారు. కాని అనుకొన్నంత రసవంతముగ పాపయ్య శౌర్యమును వర్ణించలేకపోయినాడేమిచెప్మా అనుకొన్నారు ప్రజలు.

తల్లి తనకొడుకు వంటిమీద మళ్ళీ చెయ్యివేసి చూచినది. దాసరి తాంబ్రా కిందపెట్టి రెండుచేతులతోను కొడుకు నెత్తుకొని రెండో భుజము మీదవేసుకొన్నాడు. వేసుకొని బిక్క మొగముతో భార్యవంక తిరిగి చూచేడు.

పాపయ్య బంధువులమరణ మునకై ఎన్నడూ ఎప్పుడూ విలపించనట్లు ఆ రోజున విలపించేడు. దాసరి పాడిన పాట ఇంత కరుణా మయముగా ఎప్పుడూలేదని అనుకొన్నారు ప్రజలు. పాపయ్యతో పాటు దాసరితో పాటు ప్రజలుకూడా కన్నీళ్ళు విడిచి విలపించారు.

అనాడా దాసరి ఆలపించిన విలాప గీతికకు దాసరి హృదయతంత్రులే తంబురాతీగలై శ్రుతికలిపినవి..

అనాడా దాసరి ఆలపించిన విలాపగీతికకు ఆ తల్లి తన హృదయముపయిమీద చేతులతో గుమిసి వాయించింది. 1927

-చింతా దీక్షితులు